vaarthapatrika.com

# వార్తపత్రిక

జాతీయ తెలుగు దినపత్రిక

vaarthapatrika.com / epaper.vaarthapatrika.com

TS-02-0297488

విలేకరులు కావలెను వార్తపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న వార్తపత్రిక దినపత్రికలో బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సాహవంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490617567- 87903 15659

ఎడిటర్ : మరే చిన్నబాబు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 56 గురువారం , మార్చి 26, 2026 , పేజీలు -08 వెల : 2 /-

## ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

- ఇరాన్‌ను సైనికంగా అంతమొందించాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్,25 :** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో తాము గెలిచా మని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రటించుకున్నారు. ఈ పోరులో ఇరాన్‌ను సైనిక పరంగా అంతమొం దించామని ఆయన అన్నారు. ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదనేదే తమ మొదటి షరతు అని.. దానికి ఇరాన్ అంగీకరించిందని మిగతా2లో...

## పార్టీ మారలేదన్న ఎమ్మెల్యేలకు కేసు

- స్పీకర్‌తో సహా ఏడుగురికి హైకోర్టు నోటీసులు



2లో

# రాష్ట్రంలో పెట్రోల్, గ్యాస్ కొరత లేదు

**అపోహాలు, వదంతులు నమ్మవద్దు**

**డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క స్పష్టీకరణ**



**హైదరాబాద్,మార్చి 25 :** హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలి సమావేశపు హాలులో రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావులతో కలిసి గ్యాస్, పెట్రోల్ సరఫరాలను సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, గ్యాస్ నిల్వలు, పంపిణీలో ఎటువంటి ఇబ్బంది లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అపోహాలు కలిగించే మాధ్యమాల కథనాలతో ఆందోళన చెందవద్దని వినియోగదారులకు సూచించారు. మిగతా2లో...

# స్థిరంగానే భారత్ ఇంధన భద్రత

- మరిన్ని నౌకలు భారత్‌కు చేరుకునే అవకాశం
- పశ్చిమాసియా పరిస్థితులపై అఖిలపక్షంలో ప్రభుత్వం వివరణ
- సమస్య ఎదుర్కొనేందుకు ఉమ్మడిగా సాగాలని నిర్ణయం



**న్యూఢిల్లీ,మార్చి 25 :** భారతదేశ ఇంధన భద్రత స్థిరంగా ఉందని, అదనపు సరకుతో నౌకలు వస్తున్నాయని కేంద్ర అన్ని రాజకీయ పార్టీలకు భరోసా ఇచ్చింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం పార్లమెంటు భవనంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఒక గంటా 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మిగతా2లో...

## కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి గుడ్‌బై

- నాలుగు పేజీల రాజీనామా లేఖ విడుదల
- పదేళ్లుగా అవమానాలు భరించాక కూడా...పట్టించుకోరా..?
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్న భావనే లేదు
- ఇక రేవంత్ రెడ్డిపైనే తన పోరాటం అన్న జీవన్ రెడ్డి




2లో

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేస్తాం
- స్వాధీనం చేసుకొని ఇళ్లకు కొత్తవారికి కేటాయిస్తాం
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో చర్చలో మంత్రి పొంగులేటి



2లో



## కాంగ్రెస్ పార్టీవి డైవర్షన్ పాలిటిక్స్

- ఫార్ములా రేస్ కేసు పెట్టిందే అందుకు..?
- పునరుద్ఘాటించిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,మార్చి 25 :** ఫార్ములా ఈ రేసు కేసు పేరిట రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేయ డంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల నాలుగు నెలలైందని.. ప్రభుత్వానికి సంబంధించిన పత్రాలు, మిగతా2లో...

## కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

- 27న శ్రీరామనవమి రోజు పార్టీ పేరు ప్రకటన



**హైదరాబాద్,మార్చి 25:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమాచారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి.

మిగతా2లో...



2లో

## ఆశావర్కర్ల జీతాలపై హామీ మరిచారా?

- అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు

# రాష్ట్రంలో పెట్రోలు,డీజిల్ కొరత లేదు

- డీలర్లు స్వయంగా ప్రకటన చేశారు
- కొందరు కావాలనే పుకార్ల వ్యాప్తి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి



2లో

# స్థిరంగానే భారత్ ఇంధన భద్రత

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కాంగ్రెస్ నేతలు ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు ధర్మేంద్ర యాదవ్,జావెద్ అలీ, సీపీఎం నేత జాన్ బ్రిట్టాస్, ఎల్‌జేపీ నేత అరుణ్ భారతి, డీఎంకే నేత పి.విల్సన్, ఆప్ ఎం సంజయ్ సింగ్, జేడీయూ నేత రాజీవ్ సింగ్, సంజయ్ ఝా తదితరులు పాల్గొన్నారు. టీఎంసీ నుంచి ఎవరూ హాజరుకాలేదు. అఖిలపక్ష సమావేశానంతరం కిరణ్ రిజిజు మాట్లాడుతూ, సమావేశంలో అన్ని పార్టీలు చురుకుగా పాల్గొన్నాయని, ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం, భారత్‌పై దాని ప్రభావంపై సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్రంగా, సంపూర్ణంగా స్పందించిందని, విపక్షాలందరి ప్రశ్నలన్నింటికీ సంతృప్తికరంగా సమాధానాలి చ్చిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని సమర్ధవంతగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి మద్దతుగా నిలబడతామని విపక్ష పార్టీలు హామీనిచ్చాయని చెప్పారు. 'ప్రస్తుత సంక్షోభ సమయంలో పరిస్థితికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకునే చర్యలకు సమష్టిగా మద్దతు ఇస్తామని విపక్షాలు తెలిపాయి' అని రిజిజు వివరించారు. కాగా, దేశంలో ఇంధన భద్రత స్థిరంగా, దేశ ఇంధన అవసరాలకు సరిపడా ఉందని అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. సరకు కోసం అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవడంతో పాటు వివిధ దేశాలతో సంప్రదింపులు సాగిస్తున్నామని, నిరంతరాయ ఇంధన సరఫరాకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. ఎల్‌జీపీ లభ్యత, హోర్ముజ్ జలసంధి మీదుగా షిప్‌మెంట్‌పై సమావేశంలో విపక్షాల ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే పరిస్థితి అదుపులోనే ఉందని, మరో నాలుగైదు రోజుల్లో నాలుగు నౌకలు పోర్టుకు చేరుకుంటాయని ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి ఇంధన కొరత లేదని, తగినన్ని నిల్వలు ఉన్నాయని వివరించింది. అఖిలపక్షానికి హాజరైన అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని, విపక్షాలతో ఏ సమయంలోనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. దేశ ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విపక్షాలతో చర్చలకు తలుపులు తెరిచే ఉంటాయని రాజ్‌నాథ్ అఖిలపక్ష సమావేశంలో పేర్కొన్నారు. యుద్ధంతో తలెత్తిన పరిణామాలు, ఇంధన భద్రతపై ఆందోళనలు, ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను విదేశాంగ కార్యదర్శి మిస్రీ అఖిల పక్ష నేతలకు వివరించారు. మొత్తం మీద.. పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, దేశీయంగా ప్రజల ఆందోళనలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని అఖిలపక్ష సమావేశం ఇచ్చింది.

# రాష్ట్రంలో పెట్రోల్, గ్యాస్ కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

రెగ్యులర్‌గా కొనుగోలు చేసే దాని కంటే, ఎక్కువగా కొని నిల్వ చేయవద్దని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. బంకుల వద్దకు వచ్చే చివరి వాహనదారునికి కూడా పెట్రోల్, గ్యాస్ దొరుకుతుందనే భరోసా కల్పించాలని అధికారులు, ఏజెన్సీ లను ఆదేశించారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచుటకు రెగ్యులర్‌గా ప్రెస్ బ్రీఫింగ్స్ ఇవ్వాలని సూచించారు. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులని ఆదేశించారు. పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీ లకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్ రాష్ట్రంలో ఉందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోందని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. సివిల్ సప్లై శాఖ మొత్తం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు. ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా డ్రమ్స్, కంటైనర్లలో పెద్ద ఎత్తున ఇంధనం నిల్వ చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంధన డిమాండ్ సుమారు 25 శాతం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 1200 ట్యాంకర్ల ద్వారా సరఫరా జరుగుతోందని చెప్పారు. పెట్రోల్ బంక్‌లు అనవసరంగా మూసివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అహ్మదాబాద్, సూరత్, నాగపూర్, చెన్నై వంటి నగరాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే బంక్‌లకు ఎలాంటి క్రెడిట్ సమస్యలు లేవని, సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, కమిషనర్ కర్ణన్, పోలీసు కమిషనర్లు సజ్జన్నార్, సుధీర్ బాబు, ఆయిల్ కంపెనీల ఏజెన్సీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

**హైదరాబాద్,మార్చి 25 :** గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. శాసనసభలో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్దిదారులు స్వాధీనం చేసుకోలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్దిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్దిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్దిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 99 రోజుల ప్రణాళికలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయిస్తామని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పూర్తి కావాల్సి ఉందనే దానిపై తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఎమ్మెల్యే కె. వెంకటరమణా రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇందిరమ్మ ఇల్లు మంచి పథకమన్నారు. వీటి వల్ల పేదలకు లబ్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇల్లు నాసిరకంగా ఉండడంతో శిథిలావస్థకు చేరాయని విమర్శించారు. ఇప్పటికే పూర్తయి ఎవరికి కేటాయించని డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి జోక్యం లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు.జాయింట్ ఫ్యామిలీని రీ ఎంక్వరీ చేసి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు బడ్జెట్‌లో రూ. 5 వేల కోట్లు కేటాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంకా పూర్తి కాని వాటికే ఈ రూ.5 వేల కోట్లు సరిపోవని చెప్పారు. వచ్చే ఏడాది కేటాయించిన ఇళ్లకు నిధులు ఎలా ఇస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇంతలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. పల్లా రాజేశ్వర్ రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

# కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి గుడ్‌బై

**జగిత్యాల,మార్చి 25 :** కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడానికే మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవడానికి సిద్ధంగా లేరు. ఈ క్రమంలో రాజీనామాపై మరోసారి స్పందించారు. రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోందని జీవన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న సంతోషం లేకుండా చేశారని మండిపడ్డారు. 20 నెలలుగా పార్టీలో మానసిక వేదనకు గురైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. నాలుగు పేజీల రాజీనామా లేఖను కార్యకర్తల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తానంటూ శపథం చేశారు. తనను నమ్ముకున్న అనుచరులకి పదవులు రాకపోతే పార్టీలో కొనసాగడం అవసరమా అని ప్రశ్నించారు. ప్రభుత్వ న్యాయవాదుల నియామకంలోనూ తాను న్యాయవాదిని అయినా పట్టించు కోలేదన్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్ కార్యకర్తలని హింసించి కొట్టించినవారిని గద్దెనెక్కిస్తే ఎలా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మాది అన్న ఫీలింగ్ మావారికి లేదని.. గాంధీభవన్‌లో ఫిరాయింపుల ఎమ్మెల్యే ఉంటే సమావేశంలో ఎలా పాల్గొంటారన్నారు. మీనాక్షి నటరాజన్ ఎనభై శాతం సీట్లు నాకే ఇస్తామని మాట ఇచ్చారు.. ఆ మాట పట్టించుకోలేదు. నాకు టికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎలా చెబుతాడు. పదవులు కావాలనుకుంటే నేను బీఆర్ఎస్‌లోకి వెళ్లేవాడిని. పీసీసీ అధ్యక్షు డు కావాల్సి నోడిని నా హక్కుల కొసం పోరాటం చేసే పరిస్థితి వచ్చింది. జీవన్ రెడ్డి అణగదొ క్కాలన్నదే మీ ఆలోచన. చంద్రబాబు, కేసీఆర్‌ల మీద పోరాటం చేశాను.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తాను. అడుగులకి మడగులు ఒత్తేటోళ్ళే మీకు కావాలా? రాహుల్ గాంధీ ఆలోచ నలకు అనుగుణంగా నడిచే వాణ్ని అణగదొక్కారు. బతకవచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం సపహాదారుడా? పోచారం ఇప్పటివరకు ఏం సలహాలు ఇచ్చాడని సీనియర్ నేత జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో రాహుల్ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర నాయకత్వం ప్రవర్తిస్తోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. హైకమాండ్ తీరు, పార్టీలోకి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను తీసుకున్న కారణంగానే మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

# కాంగ్రెస్ పార్టీవి డైవర్షన్ పాలిటిక్స్



(మొదటి పేజీ తరువాయి)

యంత్రాంగం అన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో ఉన్నా.. బ్యాంక్ ద్వారా అధికారికంగా నిధులు బదిలీ చేసిన ఫార్ములా–ఈ అంశం మీద మాత్రమే కేసు పెట్టగలిగారని తెలిపారు. ఈ ఏసీబీ ఛార్జ్‌షీట్ రేవంత్ ప్రభుత్వం ఎంత నిస్పృహలో ఉందో చూపించడమే కాకుండా, మా హయాంలో జరిగిన మచ్చలేని పాలనకు సర్టిఫికేట్ లాంటిదని ఆయన స్పష్టం చేశారు.బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని ఈ ఛార్జ్‌షీట్ ద్వారా స్పష్టం అవుతోందని కేటీఆర్ తెలిపారు. కేవలం అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని విజయవంతంగా ప్రభుత్వాన్ని నడిపామని స్పష్టం చేశారు. ఫార్ములా–ఈ రేస్ ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల సరసన నిలిపేందుకు ఉపయోగించిన ?49 కోట్ల బ్యాంక్–టు–బ్యాంక్ నిధుల బదిలీని కాంగ్రెస్ ప్రభుత్వం స్కామ్ అంటుందా? అని ప్రశ్నించారు. స్కాంగ్రెస్ నాయకులారా.. రండి చూసుకుందామని సవాలు విసిరారు.

# ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

(మొదటి పేజీ తరువాయి)

కూడా ట్రంప్ పేర్కొన్నారు. 'ఇరాన్‌తో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయి. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికా విమానాలు టెహ్రాన్ మీదుగా చక్కర్లు కొడుతున్నాయి. ఒకవేళ చర్చలు విఫలమైతే.. అమెరికా ఏదైనా చేయగలదు' అని ట్రంప్ చెప్పారు. మరోవైపు ఇరాన్.. అమెరికాకు హోర్ముజ్ జలసంధికి సంబంధించి ఓ పెద్ద గిఫ్ట్ ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. అయితే.. ఆ బహుమతి ఏంటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అది చాలా విలువైన గిఫ్ట్ అని చెప్పుకొచ్చారు. అయితే.. ట్రంప్ వ్యాఖ్యాలను పూర్తిగా తోసిపుచ్చింది ఇరాన్. అమెరికాతో ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ వంటి దేశాలతో కలిసి ఇరాన్.. అమెరికాతో మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ ఇటీవల అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడినట్టు పాక్ మీడియా సంస్థలు వెల్లడించినట్టు సమాచారం. మరోవైపు.. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్.. ఇరాన్‌పై దాడులను కొనసాగించాలని ట్రంప్‌ను కోరినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో రాసుకొచ్చింది. యుద్ధానికి ట్రంప్ 5 రోజుల విరామం ప్రకటించి నప్పటికీ.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. సౌదీ అరేబియా బాలిస్టిక్ క్షిపణి ఇరాన్‌కు చెందిన 6 డ్రోన్‌లను కూల్చివేసింది. తూర్పు ప్రావిన్సులో తమ వాయు రక్షణ వ్యవస్థ ఒక బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసిందని సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఆ వివరాల ప్రకారం.. అదే ప్రాంతంలో కనీసం 6 డ్రోన్‌లను కూల్చివేసినట్టు సమాచారం. ఇజ్రాయెల్, కువైట్ దేశాలపైనా ఇరాన్ డ్రోన్ల దాడి కొనసాగిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది.

# కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది.

# ఆశావర్కర్ల జీతాలపై హామీ మరిచారా?

**హైదరాబాద్,మార్చి 25 :** ఎన్నికల సందర్భంగా ఓట్లు దండుకోవడం కోసం అలవిమాలిన హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీష్‌రావు మండిపడ్డారు. అసెంబ్లీ వేదికగా సర్కారుపై నిప్పులు చెరిగారు. ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నాడు తన ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్నదని ఆయన గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ తన మానిఫెస్టోలో పేర్కొన్న మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి ఇస్తుందని ప్రశ్నించారు. గత వారం రోజులుగా ఆశా వర్కర్లు ధర్నా చేస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం వారికి రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్‌ను కూడా బంద్ చేశారని విమర్శించారు. దాంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలు 20 శాతం తగ్గాయని చెప్పారు. దీనిపై ప్రభుత్వ చర్యలు ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్‌ను ఎప్పటి నుంచి తిరిగి ప్రారంభిస్తారో చెప్పాలని నిలదీశారు.

# రాష్ట్రంలో పెట్రోలు,డీజిల్ కొరత లేదు

**హైదరాబాద్,మార్చి 25 :** తెలంగాణ రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయిల్ సంస్థల వద్ద సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయంటూ.. తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. పెట్రోలు, డీజిల్ కొరత రాకుండా ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని, ఆ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వాహనదారులు రోజువారీ అవసరాల మేరకు.. పెట్రోలు, డీజిల్‌ను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వస్తున్న పుకార్లపై ఆయన స్పందిస్తూ.. 'అమెరికా, ఇజ్రాయిల్ ? ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్ కొరత ఏర్పడిందంటూ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదు. ఇండియన్ ఆయిల్, హెచ్ పీసీఎల్, బీపీసీఎల్ వంటి అన్ని పబ్లిక్ సెక్టార్ ఆయిల్ కంపెనీల వద్ద అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉంది. పెట్రోలు, డీజిల్ సరఫరాలోనూ లోపం లేదు. రాష్ట్ర అవసరాలకు సరిపడా పెట్రోలు, డీజిల్ సరఫరా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇదే విషయాన్ని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోషియేషన్ కూడా స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మి చాలా మంది పెట్రోలు బంకుల వద్దకు పరుగులు తీస్తూ అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో కొన్ని పెట్రోలు బంకుల్లో తాత్కాలికంగా కొరత ఏర్పడుతోంది. ఇదే అదనుగా కొంతమంది కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ దందాకు పాల్పడే ప్రమాదం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వదంతులను నమ్మొద్దని ప్రజలకు విజ&ఝప్తి చేస్తున్నా' అని అన్నారు.

# పార్టీ మారలేదన్న ఎమ్మెల్యేలకు కేసు

**హైదరాబాద్,మార్చి 25 :** పార్టీ మారలేదన్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సైతం కోర్టు నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై ఈ రోజు విచారణ జరిగింది. దాంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన జాబితాలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికేపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు ఉన్నారు. ఏప్రిల్ 16వ తేదీ ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

# 28న ఎపి అసెంబ్లీ ప్రత్యేక సమావేశం




**అమరావతి,మార్చి 25 :** ఈ నెల 28వ తేదీన ఏపీ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ మేరకు సమావేశం నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల అయింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేశారు. 28వ తేదీ ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా అమరావతిని ఏపీ రాజధానిగా ప్రకటిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయనుంది. అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏదన్నది పార్లమెంట్ రికార్డుల్లో స్పష్టంగా ఉండేలా కేంద్రం ద్వారా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణాలకు కేంద్రం నుంచి రూ.15 వేలకోట్లు, హడ్కో ద్వారా మరో రూ.11 వేలకోట్లు సమకూరుస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. అమరావతితో అసెంబ్లీ, హైకోర్టు, ఐదు టవర్ల ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. అసెంబ్లీ 250 మీటర్ల ఎత్తులో ఉంటుందని, ప్రజలు పైకి వెళ్లి నగరం మొత్తాన్ని చూడవచ్చని తెలిపారు.

# పెట్రోల్ టెన్షన్... పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల క్యూలు


- చమురు కొరత అంటూ సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం
- నగరంలోని అన్ని ప్రాంతాల్లో వాహనదారుల ఆందోళన




**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, మార్చి 25:** కూకట్పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో మాత్రమే కాకుండా నగరంలో అనేకచోట్ల పెట్రోల్ కొరత ఉందన్న వదంతులు తీవ్ర కలకలం రేపాయి. నిన్నటి నుంచి ఈ ప్రచారం సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించడంతో, వాహనదారులు పెద్ద ఎత్తున పెట్రోల్ బంకుల వద్దకు తరలివచ్చి బారులు తీరారు. కొన్ని ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాల క్యూలు కనిపించాయి. కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలలో యుద్ధం ఎఫెక్టు స్పష్టంగా కనిపిస్తోంది. పెట్రోల్ కొరత అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ప్రచారాలతో వాహనదారులు బెంబేలెత్తిపోయారు.యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో చమురు సరఫరాలు నిలిచిపోయాయనే అపోహలు ప్రజల్లో భయాన్ని కలిగించాయి. దీంతో చాలా మంది వాహనదారులు అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకునేందుకు ప్రయత్నించారు. ఈ అకస్మాత్తు డిమాండ్ పెరగడంతో కొన్ని పెట్రోల్ బంకుల్లో తాత్కాలికంగా 'నో స్టాక్' బోర్డులు కనిపించాయి.అయితే, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వదంతులను ఖండించాయి. దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేదని, అవసరమైనన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరమైనంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం నుంచి సాయంత్రం వరకు బంకుల వద్ద భారీ రద్దీ నెలకొంది. కొందరు గంటల తరబడి క్యూలో నిలబడి ఇబ్బందులు పడ్డారు.

ట్రాఫిక్ కూడా కొన్ని చోట్ల స్థంభించిపోయింది.సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాల వల్లే ఈ పరిస్థితి నెలకొన్నదని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు నిర్ధారించని సమాచారాన్ని నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## గురుకుల పాఠశాలకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక




**చౌటుప్పల్,మార్చి25,(వార్త పత్రిక :** చౌటుప్పల్ మండల పరిధిలోని ఎనగండి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పానుగోతు అఖిల్ గురుకుల పాఠశాల సర్వేలు, పానుగోతు ఆకాంక్ష మునుగోడు బిసి వెల్ఫేర్,పానుగోతు కార్తీక్ మునుగోడు ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కే.లింగారెడ్డి తెలిపారు.
ఉత్తీర్ణత పొందిన విద్యార్థులను గ్రామ సర్పంచ్ కరంటోతు రాజు నాయక్, ఉపాధ్యాయురాలు అఖిల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కరంటోతు మమత కృష్ణ నాయక్, గ్రామపంచాయతీ సెక్రెటరీ,కారొబార్ రాజు నాయక్ అభినందించారు

## చౌటుప్పల్ మండలాన్ని అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి



**చౌటుప్పల్, మార్చి 25(వార్త పత్రిక) :** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నది కావున అందులో భాగంగా చౌటుప్పల్ ని కూడా అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని చౌటుప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి నాయకులు కోరారు.నేడు చౌటుప్పల్ ఆర్డిఓ అధికారికి చౌటుప్పల్ నియోజకవర్గ సాధన సమితి నాయకులు చౌటుప్పల్ ని అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం, దాదాపు 7 మండలాల ప్రజలు విద్యా, వైద్యం, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఈ చౌటుప్పల్ పైన ఆధారపడి నిత్యం వేల సంఖ్యలో ఇక్కడికి రాకపోకలు నిర్వహిస్తుంటారు.చౌటుప్పల్ అన్ని రంగాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందు తుండడం వల్ల వేల సంఖ్యలో ప్రజలు ఇక్కడ నివసిస్తుండడంతో ఇది అన్ని రకాలుగా అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయడానికి అర్హత ఉన్నది. కావున చౌటుప్పల్, నారాయణపూర్, గట్టుప్పల్, చిట్యాల, రామన్నపేట, వలిగొండ, పోచంపల్లి మండలాలను కలిపి చౌటుప్పల్ ని కేంద్రంగా చేసుకుని చౌటుప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని అన్నారు

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపనలో బుక్క వేణుగోపాల్



**వార్త పత్రిక , రాజేంద్రనగర్, మార్చి 25 :** పురపాలక పరిధిలోని ఇందిరానగర్ దొడ్డి లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిక్షపన కార్యక్రమంలో భాజపా రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్ పాల్గొని పూజా ప్రసాదాలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియో జకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలోని రాళ్లగూడలో గల ఇంద్రారెడ్డి కాలనీలో అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో బుక్క వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణదారులు, ధర్మకర్త, శంషాబాద్ పురపాలక మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.
పెదనంతరం పూజా ప్రసాదాలు స్వీకరించారు.

# మార్చ్ 25 బ్లాక్ డే పెన్షనర్స్ వాలిడేషన్ ఆక్ట్ 2025

- ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు





**వార్త పత్రిక షాద్ నగర్ మార్చ్ 25:** బుధవారం మార్చ్ 25 బ్లాక్ డే... పెన్షనర్స్ వాలిడేషన్ ఆక్ట్ 2025 గురించి ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపుమేరకు, జిల్లా కలెక్టర్ల ద్వారా ,తాలూకా స్థాయిలో ఆర్డీవోల ద్వారా, మండల ఎమ్మార్వోల ద్వారా పెన్షన్ వాలిడేషన్ ఆక్ట్ 2025 రద్దు చేయాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి మహా వినతి పత్రం పంపించడం భాగంగా షాద్ నగర్ యూనిట్ పెన్షనర్స్ అసోసియేషన్ బుధవారం స్థానిక ఆర్డిఓ కి ఎమ్మార్వో కి మెమొరండం సమర్పించనైనది.ప్రధాన సమస్యలు 1)పెన్షన్ వాల్యుయేషన్ 25 రద్దు చేయాలి 2) 398 టీచర్లకు నేషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి 3)కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా పెండింగ్ డీఏలు విడుదల చేస్తూ నూతన పిఆర్సి ప్రకటించి 1-7-23 నుండి అమలు చేయాలి 4) 2024తర్వాత రిటైర్డ్ అయిన పెన్షన్నర్ లకు ఏక మొత్తంలో పెన్షన్ బెనిఫిట్స్ విడుదల చేయాలి.పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి. పెన్షన్ సమస్యల తక్షణ పరిష్కారాలకై పెన్షనర్ల ప్రత్యేక డైరెక్టర్ ఏర్పాటు చేయాలి.6)20 సంవత్సరాల సర్వీస్ కే పూర్తి పెన్షన్ చెల్లించాలి. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీ వెల్దండ రామారావు. ప్రధాన కార్యదర్శి నందిగామ సురేష్ కుమార్ .ఆర్థిక కార్యదర్శి శ్రీ పి సుధాకర్ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ మండల అధ్యక్షులు జనార్ధన్ ,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, గణేష్ కుమార్ ,కార్యవర్గ సభ్యులు శ్రీమతి రమాదేవి, శ్రీ రంగరాజు కుమార్ శ్రీ నాగేశ్వర్ సభ్యులు ప్రతాప్ రెడ్డి ,శ్రీ అనిల్ కుమార్ ,శ్రీ రామిరెడ్డి గారు ,శ్రీ నారాయణ శ్రీమతి గిరిజశ్రీ జగన్ దారు, శ్రీమతి సువర్ణ తదితరులు పాల్గొన్నారు,

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో షట్టర్ల అమ్మకం వద్దు... వేలంపాటే ముద్దు

- బి ఆర్ ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్




**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, మార్చి 25:** డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో ఉన్న వాణిజ్య షట్టర్లను నేరుగా అమ్మివేయడం కాకుండా, వాటిని వేలంపాట ద్వారా కేటాయిస్తే ఆ ఆదాయాన్ని మౌలిక వసతుల నిర్వహణకు వినియోగించుకోవచ్చని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ప్రభుత్వానికి సూచి ంచారు.తెలంగాణ బడ్జెట్ 2026-27 అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఏడవ రోజు నిర్వహించిన ప్రశ్నోత్తరాల్లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ "డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్వహణ, కేటాయింపు" అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్, బహదూర్‌పల్లి, నిజాంపేట్, బాచుపల్లి, డి.పోచంపల్లి, కైసర్‌నగర్ ప్రాంతాల్లో దాదాపు 13 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించగా, వాటిలో 9 వేల ఇళ్లను ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించామని తెలిపారు. హై రైజ్ అపార్ట్మెంట్ తరహాలో నిర్మించిన ఈ ఇళ్లలో నిర్వహణ ఖర్చులను సమర్థంగా నిర్వహించేందుకు గ్రౌండ్ ఫ్లోర్‌లో వాణిజ్య షట్టర్లు నిర్మించామన్నారు. ఆ షట్టర్లను ఇప్పటివరకు వేలంపాట నిర్వహించకపోవడంతో లిఫ్టులు, విద్యుత్, ఎస్టిపి నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దీని వల్ల లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.షట్టర్ల వేలంపాటపై హౌసింగ్ బోర్డ్ అధికారులను ప్రశ్నించగా, క్యాబినెట్ ఆమోదం అవసరమని, ప్రస్తుతం ఆమోదం వచ్చిన నేపథ్యంలో వాటిని అమ్మే ప్రక్రియలో ఉన్నామని సమాధానం ఇచ్చారని తెలిపారు. అయితే, షట్టర్లను నేరుగా అమ్మివేస్తే భవిష్యత్తులో నిర్వహణ ఖర్చులకు ఆదాయం తగ్గిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.షట్టర్లను అమ్మడం కాకుండా వేలంపాట ద్వారా అద్దెకు ఇచ్చి, ఆ ఆదాయాన్ని స్థానిక కమిషనర్ ఆధ్వర్యంలో వినియోగిస్తే డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల్లో లిఫ్టులు, విద్యుత్, ఎస్టిపి వంటి మౌలిక వసతుల నిర్వహణ సులభంగా జరుగుతుందని సూచించారు.ఇక భౌరంపేట్, గాగిల్లాపూర్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు ఎప్పుడు పూర్తవుతాయో స్పష్టమైన గడువు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో స్థానికులకు 10 శాతం కేటాయింపు నిర్ణయం ప్రకారం ఖాళీగా ఉన్న ఫ్లాట్లను గుర్తించి, స్థానిక పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# సెట్విన్ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి సతీమణి వాకిటి లలిత




**వార్తాపత్రిక నారాయణపేట జిల్లామక్తల్ :** నియోజకవర్గం లోని విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచన..తెలంగాణ రాష్ట్ర పాడి పశుసంవర్ధక డెయిరీ క్రీడా మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో తన సొంత నిధుల నుంచి మక్తల్ నియోజకవర్గం లో పూర్తి ఉచితంగా సెట్విన్ వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ను ఏర్పాటు చేయగా... కంప్యూటర్ టైలరింగ్ మగ్గం వర్క్ బ్యూటీషియన్ కోర్సులలో 240 మంది విద్యార్థులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత సూచించారు. బుధవారం మక్తల్ పట్టణంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న సెట్విన్ కేంద్రంను వాకిటి లలిత సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆమెకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం కంప్యూటర్, టైలరింగ్, జర్దోసి మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సులలో ఉచితంగా శిక్షణ పొందుతున్న 240 మంది విద్యార్థులను స్వయంగా కలుసుకొని అందుతున్న శిక్షణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి ఉచిత నోట్ బుక్స్ అందజేశారు.ఈ సందర్భంగా వాకిటి లలిత మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతం నుంచి మహిళలు స్వయం ఉపాధి పొందేందుకుగాను వివిధ విభాగాల్లో మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో ఉచిత శిక్షణను అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడు నెలల పాటు శిక్షణ అందించి హైదరాబాద్ సెట్విన్ కేంద్రం చే పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ సర్టిఫికెట్ అందిస్తామని, దీంతో పాటు ఉపాధి పొందేందుకు బ్యాంకు రుణాలు సైతం అందిస్తుందని భరోసా ఇచ్చారు. విద్యార్థులు ఆయా రంగాల్లో రాణించి, స్వయం ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా సెట్విన్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, మక్తల్ సెట్విన్ ట్రెయినర్లు తిమ్మన్న, వీరమ్మ, స్వప్న ,ఫర్హానా, సిబ్బంది ప్రవీణ్, లక్ష్మీ, స్థానిక వార్డు కౌన్సిలర్ కలాల్ శ్రీ విద్య నిరంజన్ గౌడ్, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్కారి రవి కుమార్, మార్కెట్ డైరెక్టర్ శాలంబిన్ ఉమర్, నాయకులు నాగరాజు, పూజ శివ, ఓబులేష్ ,కల్లూరి గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ సింహద్వారం భక్తి,విశ్వాసం మరియు సంప్రదాయాలకు ప్రతీక

- ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి
- దేవుని గుడి తండాలో వెంకటేశ్వర స్వామి
- కళ్యాణ మహోత్సవం మరియు దేవాలయ
- సింహద్వారం ప్రారంభోత్సవం






**వార్త పత్రిక షాద్ నగర్ మార్చ్ 25:** దేవాలయ సింహద్వారం అనేది దేవాలయానికి ప్రవేశ ద్వారం మాత్రమే కాదని,అది మన భక్తి,విశ్వాసం మరియు సంప్రదాయాలకు ప్రతీకని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.కేశంపేట మండలం దేవుని గుడితండాలో శ్రీ లక్ష్మీఅలివేలుమంగా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ సింహద్వారా ఆవిష్కరణ మరియు కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజకార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచులు తాంద్ర విష్ణువర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,దేవునిగుడితండా సర్పంచ్ సుజాత హన్మంత్ నాయక్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,ఇప్పలపల్లి సర్పంచ్ జంగయ్య,మాజీ సర్పంచ్ ఆంజనేయులు,మాజీ ఎంపిటిసి రాంచదర్, ఉపసర్పంచులు రవి నాయక్, జ్యోతి నరేందర్ రెడ్డి,నాయకులు బద్రునాయక్, నరేందర్,రామకృష్ణ హన్మం త్,శ్రీ ను, రతన్,దేవునిగుడి తాండ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి మనసుకు బలం, సమాజానికి ఐక్యత

- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- కేశంపేటలో శ్రీ సీత రామాంజనేయ దేవాలయ
- ధ్వజస్తంభ ప్రతిష్టలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్





**వార్త పత్రిక షాద్ నగర్ మార్చ్25:**కేశంపేట మండలకేంద్రంలోని శ్రీ సీత రామాంజనేయ దేవాలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట పూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. ఈ శుభకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా సామాజిక ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇలాంటి పవిత్ర కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని తెలిపారు. దేవాలయ అభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, స్థానిక సర్పంచ్ శ్రీశైలం, మాజీ సర్పంచులు వెంకట్ రెడ్డి, యాదగిరి రావు, నవీన్ కుమార్, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, నాయకులు జమాల్ ఖాన్, దర్శన్, జగన్ రెడ్డి, రామకృష్ణ, ప్రవీణ్ రెడ్డి, బైకని శేఖర్, నరేష్ యాదవ్, శ్రీను, వెంకటేష్, రాము, జగన్ తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యరంగానికి 30% నిధులు కేటాయించాలి

- విద్యాశాఖకు మంత్రి కేటాయించాలి
- పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలి
- విద్యార్థులపై అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఆకాష్ నాయక్ ఆగ్రహం



**వార్త పత్రిక షాద్ నగర్ మార్చ్25:** విద్యారంగానికి బడ్జెట్లో నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపునిచ్చిన "చలో అసెంబ్లీ" ముట్టడిని అడ్డుకోవడం మరియు విద్యార్థి నేతలను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని ఏఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఆకాష్ నాయక్ తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు ప్రతాపం చూపడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ?నేడు హైదరాబాద్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆకాష్ నాయక్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అన్నారు. కేవలం విద్యారంగంపై బడ్జెట్ కేటాయింపులను నిరసించినందుకే విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని ధ్వజమెత్తారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం, అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశత్వానికి సాక్ష్యం.పోలీసుల లాఠీలకు, అరెస్టులకు విద్యార్థి లోకం భయపడదని.. విద్యారంగం పట్ల ప్రభుత్వం చూపుతున్న వివక్షను ప్రతిఘటించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. అదుపులోకి తీసుకున్న విద్యార్థులందరినీ వెంటనే విడుదల చేయాలని, అలాగే విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.?విద్యార్థి శక్తిని అణచివేయడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదని, బడ్జెట్ కేటాయింపులపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని ఆకాష్ నాయక్ హెచ్చరించారు. ఈ అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ నుంచి ఏఐఎస్ఎఫ్ నాయకులు సంతోష్ నాయక్, ప్రకాష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- ఎస్ఎఫ్ఐ విద్యార్థి
- అధ్యక్ష కార్యదర్శులు దాసరి ప్రకాష్ తిగుళ్ళ శ్రీనివాస్ ముందస్తు అరెస్ట్ చేయడం జరిగింది



**చౌటుప్పల్, మార్చి 25,(వార్త పత్రిక) :**విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం శాంతియుతంగా సాగుతున్న 'ఛలో అసెంబ్లీ' పిలుపును అణచివేయాలని చూడటం ప్రభుత్వ పిరికిపంద చర్య ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం దుర్మార్గం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 30% కేటాయింపు చేయాలని అన్నారు ప్రభుత్వం ఏర్పడి రెండు నర సంవత్సరాలు అయినా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు,పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటు ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు స్కాలర్షిప్ అందకపోవడం వల్ల విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉన్నది పేద విద్యార్థి విద్యకు దూరం చేసే పరిస్థితిగా ప్రజాపాలన ప్రభుత్వం చూస్తుందని మండిపడ్డారు అద్దె భవనాలలో నడుస్తున్న గురుకులాలు సంక్షేమ వసతిగృహాలు కేజీబీవీలకు సొంత భవనాలు నిర్మించాలి అని అన్నారు .తెలంగాణ రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం ఎన్ఈపి 2020 అమలు కాకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి అని అన్నారు రాష్ట్ర యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన నాయకులు మండల ఉపాధ్యక్షులు వరుణ్,మండల నాయకులు రాజు పెరియర్ అరెస్టు కావడం జరిగింది

# ప్రతి సంవత్సరం ఒడ్లు వలచి తలంబ్రాలు చేయడం మా అదృష్టం

- శ్రీ సీతారామచంద్ర స్వామి మహిళా భక్త మండలి



**చౌటుప్పల్, మార్చి 25,(వార్త పత్రిక) :**శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఈనెల 27 శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణం జరుగుతున్న సందర్భంగా శ్రీ సీతారాముల తలంబ్రాలు వడ్లు వలిచి తయారు చేసే కార్యక్రమం శ్రీ సీతారామచంద్ర స్వామి మహిళా భక్త మండలిచే నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మహిళా భక్తులు మాట్లాడుతూ శ్రీ సీతారాముల కళ్యాణం సందర్భంగా ప్రతి సంవత్సరం ఒడ్లువలచి తలంబ్రాలు చేయడం మా అదృష్టంగా భావిస్తున్నామని చౌటుప్పల ప్రాంత ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరగాలని ఆశిస్తూ ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నామని తెలియ చేశారు.ఈ కార్యక్రమంలో బొబ్బిళ్ళ సంధ్య,దేవాలయ ధర్మకర్త వర్కాల వెన్నెల, వెన్ రెడ్డి సంధ్య, బొబ్బిళ్ళ సంధ్య, కామిశెట్టి శ్రీదేవి,ఉప్పల కుసుమ,ముత్యాల రామ, నర్సమ్మ,మచ్చ అంబిక,డాక్టర్ మంచికంటి రాజేశ్వరి, ఉప్పల దీపిక, వనం మమత,దాడి పద్మ,నిమ్మల అండాలు, జూకంటి రేవతి, గర్దాసు లక్ష్మి, యామిని, మల్లె శాలిని, రాజపేట శ్రీలత,మామిడి వెంకటమ్మ, నెక్కంటి అనూష ,రమాదేవి బద్దంస్వప్న, కథాల ఆశ, గోషిక లక్ష్మి, బొడిగె లావణ్య, మచ్చ అంబిక తదితరులు పాల్గొన్నారు

## అక్రమ అరెస్ట్ లతో విద్యార్థి ఉద్యమన్ని ఆపలేరు

- ప్రజాపాలనలో అక్రమ అరెస్టుల
- ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ సెక్రెటరీ శివశంకర్



**వార్త పత్రిక షాద్ నగర్ మార్చ్25:**షాద్ నగర్ పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ముందస్తు అరెస్టు చేయడం జరిగింది ఈ రోజు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునివ్వగా షాద్ నగర్ లో ఉన్నటువంటి ఎస్ఎఫ్ఐ నాయకులకు ముందస్తు అరెస్టు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నాం...ఒక పక్క విద్యార్థులకు పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని చెప్తా ఉంటే విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటు.ప్రభుత్వ విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేయాలని విద్యారంగానికి కొఠారి కమిషన్ ప్రకారం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేయడం జరిగింది.కానీ రాష్ట్ర ప్రభుత్వం కనీసం 20 శాతం కూడా విద్యకు నిధులు కేటాయించకుండా 8% శాతం మాత్రమే నిధులు కేటాయించడం ప్రభుత్వ విద్యాసంస్థలని తుంగలో తొక్కడమే అని చెప్పి ఎస్ఎఫ్ఐగా తెలియజేస్తా ఉన్నాం.కాబట్టి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్ళు తెరిచి ప్రభుత్వ విద్యా రంగంపై దృష్టి సారించాలని ఎస్ఎఫ్ఐ కోరుతా ఉన్నాం.ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్నగర్ టౌన్ ఉపాధ్యక్షులు ఆదిల్ ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, సాయి తదితరులు అరెస్టయ్యారు.

## నూతన మహనీయుల కమిటీ ఎన్నిక జ్ఞానం సమానత్వం సేవ మైత్రం



**చౌటుప్పల్, మార్చి 25,(వార్త పత్రిక) :** తంగడపల్లి గ్రామంలో నూతన మహనీయుల కమిటీ ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షుడు గా ఊదరి వెంకటేష్,ఉపాధ్యక్షుడు గా ఊదరి మహేష్,ఉబ్బ లింగస్వామి,జనరల్ సెక్రటరీ గా ఉబ్బు ఉపేందర్,కార్యదర్శిగా జనగాం సురేష్,సహాయ కార్యదర్శి గా ఉబ్బు మహేశ్,కోశాధికారిగా ఊదరి గణేష్,సమన్వయకర్తగా ఊదరి సుభాష్,కార్యనిర్వహణ అధికారి దాసరి మనోహర్,ప్రచార కార్యదర్శిగా దాసరి వినయ్,కార్యవర్గ సభ్యుడుగా గ్యారా లోకేష్,గౌరవ సలహాదారులు దాసరి సంజీవ, ఊదరి బాబురావు, ఉప్పలపల్లి లింగస్వామి, నాగిల్లా యాదగిరి,గౌరవ అధ్యక్షులు బొజ్జా వెంకన్న, దాసరి లింగస్వామి,కార్యవర్గ సభ్యులు,దాసరి విఘ్నేష్,ఉబ్బు నవీన్,ఊదరి నవీన్,గ్యారా నరహరి,దాసరి సాయి తేజ,గాడె నాగరాజు,మంచాల ఆకాశ్,ఊదరి వేదాంత్,ఊదరి ఈశ్వర్ కొత్తగా ఎన్నికైన మహనీయుల కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.మీ అందరి నాయకత్వంలో గ్రామంలో జరిగే అన్ని మహనీయుల కార్యక్రమాలు విజయవంతంగా జరగాలని కోరుకుంటూ ఐక్యంగా,సహకారంతో ముందుకు సాగుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాలి.మీ అందరి కృషితో ఈ కార్యక్రమం మరింత విజయవంతంగా జరగాలని ఆశిస్తున్నాము

## హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

### 29న సాలార్ హనుమాన్ ఆలయంలో మహాసభకు పిలుపు...



**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, మార్చి 25:** జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వద్ద బుధవారం నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ఈ నెల 29న సాలార్ హనుమాన్ టెంపుల్లో జరగనున్న మహాసభకు భారీ ఎత్తున హిందూ సోదరులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్లో హిందూ సమ్మేళన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని, హిందూ ఐక్యతను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.అనంతరం వారు మాట్లాడుతూ, ఈ నెల 29న సాలార్ హనుమాన్ ఆలయంలో నిర్వహించనున్న హిందూ మహాసభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ జగన్, కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకురాలు సుధా అర్కల, స్థానిక నాయకులు కృష్ణ గౌడ్, ప్రకాష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ తో సత్వర న్యాయం చౌటుప్పల్ సీఐ మన్మధ కుమార్



**చౌటుప్పల్, మార్చి 25,(వార్త పత్రిక);**ఈ నెల 28న నిర్వహించనున్న లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ సీఐ మన్మధ కుమార్ కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న పౌర వివాదాలు, చెక్కు బౌన్స్, కుటుంబ సమస్యలను పరస్పర అంగీకా రంతో త్వరగా పరిష్కరిం చుకోవచ్చున్నారు. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పే తుది నిర్ణయమని,
దీనిపై మళ్లీ అప్పీల్ కు అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు

## పెట్రోల్, ఎల్పిజి కొరతపై వదంతులు నమ్మొద్దు

**– ప్రజలకు బీజేపీ నేత పిలుపు**



**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, మార్చి 25:** పెట్రోల్, డీజిల్ ఎల్పిజి గ్యాస్ కొరత ఉందని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు పూర్తిగా వదంతులేనని, ప్రజలు అవి నమ్మి ఆందోళనకు గురికావొద్దని బీజేపీ నిజాంపేట అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ తెలిపారు.
ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఇంధన సరఫరాపై అనవసరమైన భయాందోళనలు సృష్టించేందుకు కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్, ఎల్పిజి గ్యాస్ నిల్వలను సమృద్ధిగా ఉంచుతున్నదని, రష్యా సహా మిత్ర దేశాల నుంచి నిరంతరం దిగుమతులు కొనసాగుతున్నాయని తెలిపారు.
అయితే ఈ వదంతులను నమ్మి వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరడం ఆందోళనకరమని ఆయన అన్నారు. ముఖ్యంగా నిజాంపేట సర్కిల్ పరిధిలో కొన్ని బంకుల వద్ద అనవసర రద్దీ కనిపిస్తున్నదని తెలిపారు. ప్రజలు ఇలాంటి అసత్య ప్రచారాలకు లోనవకుండా, తమ సమయాన్ని వృథా చేసుకోకుండా ఉండాలని సూచించారు.
సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్న వారిని గుర్తించి పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక అధికారులు ప్రజలకు సరైన సమాచారం అందిస్తూ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## ఆదివాసీ మహిళలపై కులోన్మాద దాడులు, హత్యలు అరికట్టాలి డాక్టర్ చందా మహేష్, జిల్లా అధ్యక్షులు తుడుందెబ్బ



**ములుగు జిల్లా (ప్రతినిధి) వార్త పత్రిక :**తాడ్వాయి మండల కేంద్రంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చందా మహేష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలపై అనాదిగా కులోన్మాద దాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ఇటీవల పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఆత్రం సమ్మక్కను ప్రేమ పేరుతో మోసం చేసి హత్య చేసిన ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో నిందితుడు కెల్కారి జలపతి మరియు అతనికి సహకరించిన కుటుంబ సభ్యులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.నాలుగు సంవత్సరాల క్రితం ఆత్రం సమ్మక్కను ప్రేమ వివాహం చేసుకున్న జలపతి, తరువాత ఆమెను మోసం చేసి, కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేసి ఇంటి నుండి పంపించివేశాడని తెలిపారు. ఈ ఏడాది మళ్లీ వివాహం చేసుకుంటానని నమ్మించి, ఆమెను గర్భవతిని చేసిన అనంతరం పెళ్లి చేసుకోవాలని అడిగినందుకు కుల వివక్షతో హత్య చేసినట్టు ఆదివాసి సంఘాల నిజనిర్ధారణలో తేలిందని చెప్పారు.
ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపించి, నిందితుడికి కఠిన శిక్ష విధించాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
అదేవిధంగా ఆదివాసీ మహిళల భద్రత, రక్షణ కోసం ప్రత్యేక చట్టం అమలు చేయాలని కోరుతూ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ మహిళల సాధికారిక న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

## రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క ఆదేశాల మేరకు , జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు

**– రామాలయం శ్రీ సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామీ వార్ల విగ్రహ ప్రతిష్ఠపన కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి**





**ములుగు జిల్లా (ప్రతినిధి) వార్త పత్రిక :**తేదీ: 25.03.2026 బుధవారం తాడ్వాయి మండలం , ఊరట్టం గ్రామ పంచాయతీ పరిధిలోని ఊరట్టం కాలనీలో శ్రీ రామ నవమి సందర్భంగా (ఎస్ఎన్ఎస్ డెవలపర్స్) ఆలయ నిర్మాణ కర్త కుమారి సబితా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామాలయ శ్రీ సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామీ వార్ల విగ్రహ ప్రతిష్ఠపన కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి వారికి ఘన స్వాగతం పలికిన ఊరట్టం సర్పంచ్ కొమరం శైలజ అనంతరం వారికి శాలువాతో సత్కరించి సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కామారం సర్పంచ్ కోర్నబెల్లి సావిత్రి , తాడ్వాయి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గొ0ది సరిత , కాంగ్రెస్ పార్టీ నాయకులు , గ్రామస్తులు , తదితరులు పాల్గొన్నారు

## రహదారి భద్రత.. జీవితానికి రక్షణ




**చౌటుప్పల్, మార్చి 25,(వార్త పత్రిక) :**వాహనదారులు రహదారిపై ప్రయాణించేటప్పుడు రహదారి నిబంధనలు పాటిస్తూ జీవితాన్ని రక్షించుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథం సూచించారు.
బుధవారం పురపాలక కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవా ఆధ్వర్యంలో ప్రమాద నివారణకు వాహనాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు సైదిరెడ్డి పాల్గొని వాహనాదారులకు అవగాహన కల్పించారు. వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. నిర్ణీత వేగ పరిమితులను పాటించాలని, మలుపుల వద్ద వేగం తగ్గించాలని తెలిపారు. మద్యపానం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. వాహనం నడుపుతూ ఫోన్ మాట్లాడరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు రవాణా శాఖలకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ కార్యదర్శి ఎండి అతహర్ పాష, కోశాధికారి సిలివేరు మంగయ్య, ట్రాఫిక్ కానిస్టేబుల్ జగన్, హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి, వాహనదారులు పాల్గొన్నారు

# నంద్యాలలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**పత్తికొండ మార్చి25(వార్త పత్రిక):–** పత్తికొండ సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎం. రవిచంద్ర ఏప్రిల్ 17 18 19 నంద్యాలలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని బుధవారం పత్తికొండ మండలం హోసూరు వేర్ హౌస్ గోడౌన్ హమాలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం వేర్ హౌస్ గోడౌన్ అమాలి వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పత్తికొండ సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎం. రవిచంద్ర, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో ఏప్రిల్ 17 18 19 జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు కార్మికులు కర్షకులకు వెన్నుగా ఉంటుందని సిఐటియు చేపట్టే ఉద్యమాల ద్వారానే రాష్ట్రంలో అనేక కార్మిక సంఘాలు వారి హక్కులను సాధించుకోవడం జరుగుతుందని ముఖ్యంగా హమాలీ కార్మిక వర్గం సిఐటియు వెన్నంటే ఉంటుందని వారి కోసం సిఐటియు నాయకత్వం కూడా అహర్నిశలు పనిచేయడం జరుగుతుందని కష్టజీవుల కోసం సిఐటియు కథం తొక్కుతుందని ప్రభుత్వాలు మాత్రం కార్మిక వర్గాన్ని నేరుగారిచే ఆలోచన విధానంతో ముందుకు కదులుతాయని కార్మికులకు ఎన్నికల హామీలు ఇచ్చిన వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని ప్రభుత్వ పథకాలను ఏదో ఒక వంక పెట్టి కార్మికులకు దూరం చేస్తున్నటువంటి దుర్మార్గమైన చర్యను వెంటనే ఆపాలని అన్ని ప్రభుత్వ పథకాలను కార్మికులకు అందేలా అధికారులు యంత్రాంగం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వేర్ హౌస్ గోడౌన్ హమాలీలు సుంకన్న, నాగేంద్ర, వంశీ, టి. సహదేవుడు, ఎం. రాజు, హుసేని, మధు, మద్దిలేటి, వై. రమేష్, ఏ. అమాస్, తదితరులు పాల్గొన్నారు

# తొలి సభ్యత్వం తీసుకుని విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన సర్పంచ్ బోడ బాలు నాయక్

**-తొలి గ్రంథాలయ సభ్యత్వం స్వీకరించిన సర్పంచ్ బోడ బాలు నాయక్**

**-త్వరలోనే గ్రంథాలయానికి నూతన భవనం:జిల్లా చైర్మన్ పసుపులేటి వీరబాబు**

**-99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సభ్యత్వ నమోదు**




**వార్తాపత్రిక:టేకులపల్లి,మార్చి 25 :**మండల కేంద్రమైన టేకులపల్లిలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యచరణ'ను పురస్కరించుకొని శాఖా గ్రంథాలయంలో 'గ్రంథాలయ పండుగ' మరియు సభ్యత్వ నమోదు కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా తొలి గ్రంథాలయ సభ్యత్వాన్ని టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్ స్వీకరించి,సభ్యత్వ నమోదును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.."పుస్తకం ఒక మంచి స్నేహితుడితో సమానం.గ్రంథాలయంలో ఎంతో విలువైన విజ్ఞాన సంపద ఉంది. విద్యార్థులందరూ సెల్‌ఫోన్లకు,వ్యసనాలకు దూరంగా ఉండి,పుస్తక పఠనం ద్వారా తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి.క్రమశిక్షణతో కూడిన చదువుతోనే మీరు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరు"అని పిలుపుని చ్చారు. టేకులపల్లి గ్రంథాలయానికి త్వరలోనే నూతన భవనాన్ని నిర్మించబోతున్నామని,ఆధునిక వసతులతో విద్యార్థులకు అందు బాటులోకి తెస్తామని ఆయన శుభవార్త చెప్పారు.టేకులపల్లి మండలంలో విద్యావంతులు అధికంగా ఉన్నారని,పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాన్ని ఒక దేవాలయంగా భావించి కష్టపడి చదవాలని కోరారు.ఈ విద్యా చైతన్య కార్యక్రమంలో టేకులపల్లి ఉపసర్పంచ్ అనంతుల వసంత, వార్డు మెంబర్ కోకాయ,గ్రంథపాలకుడు ఆర్. నాగన్న,ఎంఆర్ఓ కార్యాలయ ఆర్.ఐ రత్తయ్య,రాధాకృష్ణ మరియు ఇతర విద్యావంతులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# తుడుందెబ్బ సమావేశాలు లంబాడీలు చెప్తే మహాబాద్ పోలీసు శాఖ అడ్డుకోవడం విడ్డూరంగా ఉంది

**– ఆర్టికల్ 19 బావ ప్రకటన స్వేచ అసలు ఉందా లేదా**




**ములుగుజిల్లా (ప్రతినిధి)వార్త పత్రిక :**బలిసిన లంబాడీల రాజకీయ కుట్రల పక్షమే కాంగ్రెస్ పాలనఅక్రమ అరెస్టు లు చేపించే లంబాడీల వెకిలి చేష్టలు తుడుందెబ్బ ఉద్యమాన్ని అపలేవుఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జాతీయ మరియు రాష్ట్ర కమిటీల తేదీ:11/03/2026 మేడారం డిక్లరేషన్ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల్లో 18 జిల్లా కమిటీలు,175 మండల కమిటీలు 2000 గ్రామ కమిటీల నిర్మాణం చేయడంలో భాగంగా తేదీ: 15 /3 / 2026న ములుగు జిల్లా కమిటీని పూర్తిచేసుకుని రెండవ దఫలో తేదీ 22/3/ 2026 న మహబూబాబాద్ జిల్లా కమిటీ నిర్మాణం చేయడంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో వీర భద్ర ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి వెళ్లే క్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ జాతీయ ఉపాధ్యక్షులు పోడెం బాబు రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి ఆదివాసి కళా సమితి రాష్ట్ర నేత యునేని మధు విద్యార్థి నేత గొంది రాకేష్ లను పోలీసులు మార్గం మధ్యలో అడ్డుకొని మీకు అనుమతి మీటింగ్ కి వెళ్లే అనుమతి లేదని పైనుండి ఆర్డర్ అని అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించి అక్రమ అరెస్టు చేసి బైండోవర్ చేయడం జరిగిందని అన్నారు అనంతరం అరెస్టు కాబడిన రాష్ట్ర అధ్యక్షులు డా.మైపతి అరుణ్ కుమార్ జాతీయ ఉపాధ్యక్షులు పోడెం బాబు ూఖ రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవిలు మాట్లాడుతూ ఇది ప్రజాస్వామిక దేశమా? ప్రజాస్వామ్య పాలన ఈ రాష్ట్రంలో నడుస్తుందా? పాకిస్తాన్‌లో ఉన్నామ? తెలంగాణలో ఉన్నామా? అర్థం కాని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. జిల్లా కమిటీ ఎన్నిక సమావేశం కేవలం 50 నుంచి 60 మందితో జరిగే సమావేశాలను కూడ జరగనివ్వకుండా లంబాడీలు కుట్రలు చేస్తుంటే ఆ కుట్రలను పసిగట్టి ప్రజాస్వామ్య హక్కులను ప్రాథమిక హక్కులను స్వేచ్ఛ హక్కులను భంగం కలగకుండ చూడాల్సిన ప్రభుత్వం మరియు ఇంటలిజెన్స్, పోలీస్ శాఖ ఏకంగా తుడుం దెబ్బ ఆధ్వర్యంలో కురవి మండల కేంద్రంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్ బుక్ చేసుకున్న దాన్ని కురవి పోలీస్ లు వెళ్ళి క్యాన్సల్ చేసి తుడుందెబ్బ మీటింగ్ కి ముందుగా మేము దరఖాస్తు చేసుకున్న ప్రకారం అనుమతి ఇచ్చి మళ్ళీ పోలీస్ లు పర్మిషన్ లేదని మా ప్రజాస్వామిక హక్కులను పోలీస్ శాఖ తన ఆధీనంలోకి తీసుకొని తుడుం దెబ్బ నేతలను తాడ్వాయి పోలీస్ స్టేషన్లో గూడూరు పోలీస్ స్టేషన్ లో కురవి పోలీస్ స్టేషన్ లో ఎక్కడికక్కడ నిర్బంధించడం ప్రజా స్వామ్య వ్యతిరేక చర్య అని అన్నారు. దీనిని పోలీస్ శాఖ పునర ఆలోచన చేయాలని అన్నారు. మాకు సమావేశాలు పెట్టి మా తుడుం దెబ్బ నిర్మా ణాలు చేసుకునే హక్కు కూడ మీరే నిర్ణయం చేస్తే ఇక దీనికి ప్రజా స్వామ్యం అని పేరు ఎందుకని అన్నారు ఇది ప్రజా ప్రభుత్వము నా లంబాడా ప్రభుత్వము అని వీరుచుకుపడ్డారుప్రభుత్వ యంత్రాంగం చేతుల మీద నడుస్తుందా లేక లంబాడ రాజకీయ కుట్రలు చేసే నాయకుల చేతిలో ప్రభుత్వాలు నడుస్తున్నాయ సమాధానం చెప్పాలని అన్నారు.ఆదివాసి ప్రాంతంలో భద్రాచలంలో పక్కా రాష్ట్రము వ్యక్తి కర్ణాటక సేవాలాల్ జయంతి వేడుకలు జరుపుతుంటే ఆదివాసి సంఘాలు వ్యతిరేకించిన గాని లంబాడీల పక్షాన చేరి దగ్గర ఉండి పోలీస్ శాఖ ఉత్సవాలు జరుపుతుంది. కోయల ఇలవేల్పు కురవి మల్లన్న సన్నిధిలో ఆదివాసీలు సమావేశం జరుపుకుంటే ఎందుకు పోలీస్ లు భద్రత ఇవ్వలేకపోతున్నారో సమాధానం చెప్పాలి అన్నారు. మొత్తం మీద లంబాడాల ఆధిపత్యం రాష్ట్రంలో చెలరేగి పోతుందని లంబాడీల వికృత చేస్తలే ప్రజాస్వామ్య వ్యవస్థ ముందు గెలుస్తున్నాయని కనీసం మీటింగ్ పెట్టుకోలేని పరిస్థితి రాష్ట్రంలో ఉంది అంటే ఇక ఆదివాసీల రిజర్వేషన్ల దోపిడి భూముల దోపిడి విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో దోపిడి ఇంకా ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని అన్నారు ఆదివాసి సమాజం ఇప్పటికైనా గాని మేలుకోవలసిన అవసరం ఉందని లంబాడీల తొలగింపుకు వైపు ప్రతి గూడెం కదలవలసిన అవసరం ఉందని అన్నారు రాజకీయ పార్టీల కావాల్సింది లంబాడీల ఓట్లని లంబాడీల ఓట్లు అధికంగా ఉన్నాయి కాబట్టి వారి ఆదివాసీలు అంటే చులకన అని అన్నారు అన్నింటికీ లెక్కలు తేలుస్తామని లెక్కలు తేల్చడానికే రాష్ట్రవ్యాప్త తుడుం దెబ్బ ఉద్యమ నిర్మాణం జరుగుతుందని నేతలు పేర్కొన్నారు వికృత చేష్టలు వెకిలి నవ్వులు లంబాడ దురహంకారం అన్నిటికీ ఫుల్ స్టాప్ పెట్టే రోజు త్వరలో తుడుం దెబ్బ చూపిస్తుందని అన్నారు అతి త్వరలో మహబూబాబాద్ జిల్లా కమిటీ తేదీని మళ్లీ ప్రకటించనున్నట్లు రాష్ట్ర కమిటీ పేర్కొంది
ఇప్పటికే లంబాడీలు ఎస్టీ లు అని సుప్రీం కోర్టుకి నోటీసులు పంపుతూ 1900 సంవత్సరం నుండే లంబాడీలు ఎస్టీ లు అని ఆదివాసి స్పెషల్ లీవ్ పిటిషన్ కొట్టిపారేయాలని రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చి తన నిజ స్వరూపం ఏంటో బయట పెట్టింది అన్నారు రాజకీయ పార్టీ లు అన్ని జై సేవలాల్ అంటూ లంబాడీ ఊడిగం చేస్తున్న సందర్భంలో ఆదివాసీలు తన నెలను నమ్ముకొని యుద్ధంకి సిద్ధం అవ్వాలని పిలుపునిచ్చారు దీనిలో ఆదివాసి కళా సమితి నేతలు యునేని మధు విద్యార్థి నేత గొంది రాకేష్ లు ఉన్నారుకొప్పుల రవి ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు:సేవాలాల్ సేన రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారావత్ కృష్ణా నాయక్



**వార్తాపత్రిక:టేకులపల్లి,మార్చి 25 :**లంబాడీల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ప్రతిష్టించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన'చలో అసెంబ్లీ'ముట్టడిని అడ్డుకోవడం,నాయకులను అక్రమంగా అరెస్టు చేయడంపై సేవాలాల్ సేన రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారావత్ కృష్ణా నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆయన విలేకరులతో మాట్లాడారు.సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని కేవలం నల్లమల అడవి ప్రాంతంలోని మద్దిమ డుగులోనే కాకుండా,రాష్ట్ర రాజధానిహైదరాబాద్ నడిబొడ్డున ప్రభుత్వం అధికారికంగా ప్రతిష్టించాలి.ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని,అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆయన హెచ్చరించారు.అరెస్టు చేసిన బంజారా సంఘాల నాయకులను ప్రభుత్వం ఎటువంటి నిబంధనలు లేకుండా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా'చలో అసెంబ్లీ'కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సేవాలాల్ సేన,లంబాడి హక్కుల పోరాట సమితి,సేవాలాల్ బంజారా సంఘం మరియు లంబాడి సేన నాయకులకు ఆయన కృతజ్ఞ తలు తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షులు బట్టు హుస్సేన్ నాయక్,చుంచుపల్లి మండల అధ్యక్షులు భూక్యా రాంబాబు నాయక్, సీతారాం నాయక్,చిన్న నాయక్,హరి నాయక్,గుగులోతు హత్తి రామ్ నాయక్,కిరణ్ నాయక్ తదితరులు పాల్గొని తమ మద్దతును తెలిపారు.

# 'ఆదరణ'తో శాశ్వత ఉపాధి

**– రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**వార్తాపత్రిక ప్రతినిధి అనంతపురం :** శాశ్వత ఉపాధి కల్పించడమే లక్ష్యం ఆదరణ 3.0 పథకాన్ని రూపొందిస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి బీసీ కుటుంబ నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగానే మూడో విడత ఆదరణ పథకంలో లబ్ధిదారులకు ఆధునిక పనిముట్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదరణ 1, ఆదరణ 2 పథకాలను గతంలో సీఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలోనూ బీసీల్లో ఉండే వృత్తిదారులకు, ఇతరులకు ఉపాధి కల్పించేలా ఆదరణ 3.0 పథకాన్ని రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా అన్ని నియోజక వర్గాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం



ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ పార్కుల ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. దీనిలో భాగంగానే ఆదరణ 3.0 పథకం కింద శాశ్వత ఉపాధి కల్పిస్తూ, ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీ యువతకు, వృత్తిదారులకు ప్రోత్సాహించాలన్నది ఆయన ప్రధాన ఉద్దేశమన్నారు. మార్కెట్ అవసరాలు, నేటి అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ఆదరణ 3.0 పథకం ద్వారా లబ్ధిదారులకు ఆధునిక పనిముట్లు, యంత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అవసరమైతే, బ్యాంకు లింకేజీ కూడా ఇచ్చేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. ఆదరణ 3.0 పథకం ద్వారా ఏవిధమైన పనిముట్లు, పరికరాలు, యంత్రాలు అందివ్వాలన్న దానిపై క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు త్వరగా తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖాధికారులను మంత్రి సవిత ఆదేశించారు.

హాస్టళ్ల మరమ్మతుల్లో నిర్లక్ష్య చూపొద్దు

మరో రెండు నెలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందని, ఈలోగా హాస్టళ్లలో మరమ్మతులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. హాస్టళ్ల మరమ్మతులకు కేటాయించిన నిధుల వివరాలను తెలుసుకున్న మంత్రి, తక్షణమే నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే ఎంజేపీ స్కూళ్లను రానున్న విద్యా సంవత్సరానికి సిద్ధం చేయాలని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బీసీ కార్పొరేషన్ జీఎం భీమశంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులే ప్రథమ గురువులు ప్రత్యక్ష దైవాలు



**చౌటుప్పల్,మార్చి 25,(వార్త పత్రిక):** తల్లిదండ్రులే ప్రథమ గురువులు ప్రత్యక్ష దైవాలని శ్రీ చైతన్య విద్యాసంస్థల దిల్సుఖ్నగర్ జోన్ ఏజీఎం మన్నే వెంకట్ రెడ్డి అన్నారు.
బుధవారం పురపాలక కేంద్రంలోని వలిగొండ రోడ్ నందు గల శ్రీ చైతన్య పాఠశాలలో ఏర్పాటుచేసిన తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమన్ని పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత బన్స్ తో కలిసి సహస్ర ఫౌండేషన్ అధ్యక్షుడు చినుకని యువరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో విద్యార్థులు తమను కని పెంచిన తల్లిదండ్రుల పాదాలను కడిగి నీటిని శిరస్సుపై చల్లుకున్నారు. తల్లిదండ్రుల త్యాగాన్ని అభినందిస్తూ వారి పాదాలకు పాదాభివందనం చేశారు.తల్లితండ్రులు తమ పిల్లలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.ఈ సందర్భంగా సహస్ర ఫౌండేషన్ అధ్యక్షుడు చినుకని యువరాజు మాట్లాడుతూ..అమ్మనాన్నలు జీవితానికి మూల స్తంభాలు, నిస్వార్థ ప్రేమకు నిలువెత్తు రూపాలన్నారు.అమ్మ ఆప్యాయతను, నాన్న బాధ్యతను పంచుతూ పిల్లల భవిష్యత్తు కోసం తమ జీవితాలను త్యాగం చేస్తారన్నారు.పాఠశాలలో ఇలాంటి కార్యక్రమలు చేయడం అరుదు,పాఠశాల తల్లితండ్రుల పూజ చేయడం అభినందనీయమన్నారు.ఈకార్యక్రమంలో పాఠశాల డీన్ దుర్గాప్రసాద్, ఏవో గోపీచంద్, ప్రైమరీ ఇంచార్జ్ పరమేశ్వరి విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన

**– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలి**
**– జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**



**వార్త పత్రిక, రాజేంద్రనగర్, మార్చి 25 :** మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్ లతో కలిసి ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 10 థీముల తో చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, మున్సిపాలిటీల, గ్రామ పంచాయతీల వారీగా పారిశుధ్యం పనులు, విద్యుత్ కు సంబంధించిన మరమ్మత్తులు, భవనాల మరమ్మత్తులు, పెయింటింగ్ వంటి పనులు పూర్తి చేయాలని, కార్యాలయాల పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ పూర్తి చేయాలని, ఏ ఒక్క శాఖలో కూడా ఒక్క ఫైల్ కూడా పెండింగ్లో ఉండకుండా పరిష్కరించాలని సూచించారు. మంజూరైన పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు వాటి పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. జనన మరణ ధృవీకరణ పత్రాల జారీ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఫైల్ లు క్లియర్ చేయాలని అన్నారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్లక్ష్య వైఖరితో కాకుండా బాధ్యతతో ప్రతి ఒక్కరూ తమకు నిర్దేశించిన పనులను పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా పని చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో సమార్ధవంతగా నిర్వహించి విజయవంతగా పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు. ప్రతి శాఖ ఈ–ఆఫీస్ నిర్వహణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వేసవి కాలం అయినందున జిల్లాలో ఏ ఒక్క చోట కూడా త్రాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని, అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని, పైపు లీకేజులు లేకుండా చూడాలని, ఎక్కడ నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అవసరమైన చోట బోరు మోటార్లు, హ్యాండ్ పంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమ్మతు పనులు జరిపించాలని అన్నారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల ప్రాంతాలను సైతం సందర్శిస్తూ నీటి సరఫరా తీరుతెన్నుల గురించి వారి ద్వారా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. ప్రస్తుత వేసవి సీజన్ దృష్ట్యా మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు, ఎంపిడిఓలు సమన్వయంతో, సమిష్టిగా పని చేయాలని అన్నారు. నీటి కొరత ఏర్పడకుండా చేపడుతున్న చర్యలు ప్రజలకు తెలిసేలా చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె.శ్రీనివాస్, డీఆర్ఓ సంగీతం, జడ్పీ సి ఈ ఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేశ్ మోహన్, సిపిఓ సౌమ్య, పిడి డీఆర్డీఏ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీష్, మిషన్ భగీరథ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, నవీన్ కుమార్ రెడ్డి, కేషురామ్, కె.రామవేశ్వరి దేవి, పద్మావతి, ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంపిఒలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క ఆదేశాల మేరకు , జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు

**– పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి హాజరై చిన్నారుడిని ఆశీర్వదించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి**



**(ములుగు జిల్లా (ప్రతినిధి) వార్త పత్రిక :** తేదీ 25.03.2026 బుధవారం తాడ్వాయి మండలం ఊరట్టం గ్రామ పంచాయతీ పరిధిలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన సారలమ్మ పూజారి కాక ప్రశాంత్ – రమ్య ఏకైక కుమారుడు ప్రేయాన్స్కు పుట్టు వెంట్రుకల కార్యక్రమం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి చిన్నారుడిని ఆశీర్వదించారుఈ కార్యక్రమంలో మేడారం సర్పంచ్ , సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చర్ప రవీందర్ , తాడ్వాయి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గౌ0ది సరిత , కామారం సర్పంచ్ కోర్నబెల్లి సావిత్రి , మండల యువజన నాయకులు చర్ప నేతాజీ , గొంది కిరణ్ , సంపత్ , నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# శంషాబాద్ ఇంద్రారెడ్డి కాలనీలో ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలు

**– ఎంతో వైభవంగా నవగ్రహ పూజా కార్యక్రమం శంషాబాద్ పురపాలక మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్**



**వార్త పత్రిక, రాజేంద్రనగర్, మార్చి 25 :** శంషాబాద్ లోని కాలనీలోని రాల్లగూడ ఇంద్రారెడ్డి కాలనీలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం నవగ్రహాల పూజలు ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగిందని అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ దారులు, శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలోని ఇంద్రారెడ్డి కాలనీలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నవగ్రహ పూజా కార్యక్రమాలో గోపాల్ యాదవ్ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో పూజా కార్యక్రమాలు ఎంతో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని బండి గోపాల్ యాదవ్ తెలిపారు. అదేవిధంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు, వేద పండితుల ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు భక్తుల సందడితో ఎంతో వైభవంగా జరుగుతున్నాయని శంషాబాద్ నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని ఆయన అన్నారు. రెండు రోజులు జరిగే విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారని భక్తులు కూడా పెద్ద ఎత్తున పాల్గొనాలనితెలిపారు.

## కరాటే పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన గోగు నందు ప్రియ విద్యార్థిని అభినందించినారు ఉప సర్పంచ్ పాలకుర్తి బాబు

**– సూర్య ఫోటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో వెంకటాపురం మండల కేంద్రంలోని కాఫీ స్వచ్ఛంద సంస్థ గ్రౌండ్లో ఆదివారం ఇంటర్ జోనల్ కరాటే ఛాంపియన్షిప్ జరిగింది**




**ములుగు జిల్లా (ప్రతినిధి) వార్త పత్రిక :** ఈ కరాటే పోటీలకు కోచ్ కరాటే మాస్టర్ నాలి స్వామి కాటాపూర్ స్కూల్ నుండి గోగు నందు ప్రియ, (8వ తరగతి చదువుతున్న ) అటెండ్ అయి గోల్డ్ మెడల్స్ సాధించింది. గోగు నందు ప్రియకు మంగళవారం నాడు కాటాపూర్ స్కూల్లో ఉప సర్పంచ్ పాలకుర్తి బాబు , స్కూల్ ప్రధానచార్యులు బాణాల సుధాకర్ మరియు టీచర్స్ అభినందించి గోల్డ్ మెడల్, ప్రశంస పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ పాలకుర్తి బాబు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికల ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో అవసరం అని ప్రతి ఒక్కరూకరాటే నేర్చుకో వాలి అనిఅన్నారుఈ కార్యక్రమంలో టీచర్స్ సక్కు వీఎ.అక్బర్ పాషా వీ.జీవన్ లాల్ ఖ.సమ్మయ్యూా. విజయ .ఙ. జయపాల్ౄా. వెంకటేశ్వర్లు జీ.శాంసన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

# ఇరాన్ పై అమెరికా,ఇజ్రాయిల్ దేశాలు దాడులు ఆపాలి

**– కూలీలకు ఉపాధిని దూరం చేసే కేంద్ర ప్రభుత్వ చర్యలు మానుకోవాలి**
**– నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు**




**వార్త ప్రతిక :-మరిపెడ :** అణ్వాయుధాలు ఉన్నాయని నెపంతో ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ లు నియంతత్వంగా దాడులు జరపడశీ వెంటనే ఆపాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు మరిపెడ మున్సిపల్ కేంద్రంలో జరిగిన సిపిఐ సమావేశంలో నల్లు సుధాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఇరాన్లో విలువైన చమురు క్షేత్రాలను కాజేయాలని కుట్రలో భాగంగా ఆ దేశ అంతర్గత విషయాలను సాకగా చూపి ఇజ్రాయిల్ అమెరికాలో దాడులు చేసి, ప్రపంచాన్ని అస్థిరపరిచే విధానాలకు ఇకనైనా స్వస్తి పలకాలని అన్నారు. పశ్చిమాసియా లో జరిగే యుద్ధంతో చమురు, గ్యాస్ సరఫరా,ఎరువుల తయారీ ఇతర రంగాలపై పడే ప్రభావశీ తో దేశ ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పెట్రోలు, గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం సరైన విధానాలను అవలంబించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీని అవమానపరిచే విధంగా చట్టానికి ఉన్న పేరును తొలగించడం, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టాన్ని దూరం చేసే విధంగా చట్టంలో అనేక మార్పులు తీసుకురావడం , కమ్యూనిస్టుల పోరాటాలతో ఏర్పడిన ఉపాధి చట్టాన్ని నీరుకార్చాలని దురుశంతోనే ఈ విధమైన కుట్రలు పన్నుతున్నారనే తీవ్రంగా విమర్శించారు.సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ ,జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్,పోలేబోయిన కిరణ్ ,పెడబోయిన సుమన్ తదితరులు పాల్గొన్నారు

## మేడారం తల్లులను దర్శించుకున్న గోదావరి రివర్ మేనేజట మెంట్ బోర్డు చైర్మన్ బి పి పాండే



**ములుగు జిల్లా (ప్రతినిధి) వార్త పత్రిక :** నీటిపారుదల శాఖ ఢిల్లీ నుండి గోదావరి రివర్ మేనేజ్ మెంట్ బోర్డు చైర్మన్ బి పి పాండే ఆధ్వర్యంలో మేడారం సమ్మక్క సారాలమ్మ తల్లులను దర్శించుకున్నారు డోలి వాయిద్యాలతో స్వాగతం పలికి సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన సురేందర్ శాలువా, కండువా కప్పి సన్మానించారు ఈ కార్యక్రమం లో బోర్డు మెంబెర్ రంగరాజన్, బోర్డు కార్యదర్శి సతీష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్ రావు, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఇంజనీర్ లు పాల్గొన్నారు

## ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు ఉద్యమం ఆగదు
## సిపిఐ జిల్లా కార్యదర్శి జంగయ్య పర్వతాలు



వార్త పత్రిక, రాజేంద్రనగర్, మార్చి 25 : పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు ఉద్యమం ఆగదని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. హైదరాబాదులోని ఇందిరా పార్కులో జరిగిన ఇళ్ల స్థలాల ఉద్యమంలో పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి, ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇల్లు అందజేయాలన్నారు. పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతి నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన నాయకులు గూడు లేని ప్రతి నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి అండగా సమ్మి గౌడ్ ఫౌండేషన్.

- కన్నీటి బాధలో ఉన్న దళిత కుటుంబానికి భరోసా
- మృతుడు సోమారపు సాయిలు కుటుంబానికి పరామర్శ, క్వింటాల్ బియ్యం వితరణ.
- క్లిష్ట సమయంలో ఉదారత చాటుకున్న అండగా సమ్మిగౌడ్
- కోతి వెంకటేశ్వర్లు గౌడ్ , మల్లయ్య యాదవ్



వార్త ప్రతిక :-కేసముద్రం :మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామం - మానవత్వమే మతం అని చాటుతూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ మరోసారి తన ఉదారతను చాటుకుంది. ఇంటికన్నె గ్రామానికి చెందిన దళిత కుటుంబ పెద్ద సోమరపు సాయిలు ఆకస్మిక మరణం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఈ విషయం కోతి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లయ్య విషయం తెలుసుకున్న ఫౌండేషన్ అధినేత చిలివేరు సమ్మి గౌడ్, బుధవారం బాధితుల ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు.సాయిలు భార్య పూలమ్మ, కుమార్తె రమ్య మరియు వారి పిల్లలను ఓదార్చిన, సాయిలు చితపటానికి పూలు వేసి నివాళి అర్పించారు సమ్మి గౌడ్, మేము ఉన్నాం.. అధైర్య పడకండి.అంటూ వారికి ధైర్యాన్ని.నూ రిపోశారు .ఇంటికన్నె గ్రామ పెద్దలు, కేవలం మాటలతో సరిపెట్టకుండా, తక్షణ సహాయంగా కింద ఆ కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేశారు.గ్రామ నాయకుల ప్రశంసలు.ఈ మానవీయ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో. పాల్గొ న్నారు.కేసముద్రంమండలంలో.పార్టీలకు,కులాలకు, మతాలకు, సంబంధం లేకుండా కడు భీధవాడు కష్టం లో ఉన్నడు అనీ తెలియజేసిన వెంటనే భాదిత కుటుంబాలు క్లిష్ట సమయం లో ఉన్న సందర్భంలో స్పందించి వారి, వారి గ్రామానికి వచ్చి సమ్మి గౌడ్ చేస్తున్న సామాజిక సేవలు వెలకట్టలేనివి అని వారు ఈ సందర్భంగా కొనియాడారు.కార్యక్రమంలో సమ్మిగౌడ్ వెంట కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రాజులపాటి మల్లయ్య, కోతి వెంకటేశ్వర్లు, భూక్య దేవేందర్, చెలగోల కట్టయ్య, చిలగోల ముత్తయ్య, మిట్టగడుపుల యాకయ్య, కదిర రాజు, దోమ్మటి రాజు, కదిరి హరీష్, వర్దల్లి రంజిత్, బానోతు యాకోబు, మంగ్య, వార్డు సభ్యులు బోళ్ళ రమేష్, దారావత్ లాలు, భూక్య వెంకన్న తదితరులు పాల్గొని సమ్మి గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పదవ వార్డులో అంగన్ వాడి భవన నిర్మాణానికి కృషి చేయాలి


- కలెక్టర్ కు వినతిపత్రం అందించిన 10వ వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్



వార్త ప్రతిక :-తొర్రూరు :మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో అంగన్వాడి కేంద్రం నిర్వహణకు శాశ్వత అంగన్వాడి భవన నిర్మాణానికి స్థల సేకరణ చేయించాలని 10వ వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్ కోరారు. బుధవారం తొర్రూరు మున్సిపాలిటీ లో కలెక్టర్ స్నేహ శబరీష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ముద్దసాని సురేష్ మాట్లాడుతూ 10వ వార్డులో అంగన్వాడి భవనం లేక కిరాయి భవనంలో సరైన సౌకర్యాలు లేవన్నారు.చిన్నారులు,గర్భిణీలుబాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా రోజులగా సొంత భవనం కోసం ఎదురుచూస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. భవన నిర్మాణానికి స్థలం లేక భవన నిర్మాణం జరగడం లేదన్నారు. స్పందించి అంగన్వాడి భవన నిర్మాణానికి స్థల సేకరణ చేసి నిధులు కేటాయించి నిధులు మంజూరు చేయించి భవనం నిర్మించాలని కోరారు. కలెక్టర్ స్పందించి త్వరలోనే స్థల సేకరణ చేసి నిధులు మంజూరు చేసి అంగన్వాడి భవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# శంషాబాద్ లో ఉచిత చల్లటి ఆరోగ్య మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించిన సిద్దు రెడ్డి

- గత ఐదేళ్లుగా ప్రజల దాహార్తిని తీరుస్తూ ఉదారత చాటుకుంటున్న సామాజిక వేత్త సిద్దు
- తన స్నేహితుడితో మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించిన సామాజికవేత్త
- ప్రతిరోజు రూ 30 వేల ఖర్చుతో మజ్జిగా సరఫరా.
- ప్రజలకు ఏదో విదంగా సహాయ పడాలనే సదుద్దేశ్యం తో ఈ కార్యక్రమాలు



వార్త పత్రిక , రాజేంద్రనగర్, మార్చి 25 : శంషాబాద్ లో బాటసారులకు స్థానిక ప్రజలకు ఉచిత ఆరోగ్య మజ్జిగ సరఫరా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని యువ సామాజికవేత్త కందకట్ల సిద్ది రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలో జాతీయ రహదారి పక్కన బుధవారం ఆరోగ్య ప్రదాయిని అయిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని తన స్నేహితుడు నాగరాజు తో ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యువ సామాజికవేత్త సిద్దు రెడ్డి మాట్లాడుతూ శంషాబాద్ పట్టణంలో గత ఐదు సంవత్సరాలుగా మజ్జిగతో బాటసారిలకు దాహార్తిని తీర్చడం జరుగుతుందని అదేవిధంగా ఈ సంవత్సరం కూడా శంషాబాద్ పట్టణంలోని షాద్నగర్ వైపు వెళ్లే బస్టాప్ వద్ద మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఇంకా నాణ్యమైన మజ్జిగను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు 7వేల నుండి 9వేల మంది బాటసారులు మజ్జిగ త్రాగానున్నట్లు తెలిపారు. అనేక సేవ కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందిన కందకట్ల సిద్దు రెడ్డి మరోసారి శంషాబాద్ పట్టణంలో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు శంషాబాద్ పట్టణ ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరిచారు.. ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారీ ఎండల నేపథ్యంలో ఉద్యోగస్తులు విద్యార్థులు, బాటసారులు, మజ్జిగను త్రాగి వెళ్లాలని సూచించారు. మజ్జిగ కేంద్రంలో రుచికరమైన నాణ్యమైన మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త కందకట్ల సిద్దు రెడ్డి మాతృమూర్తి భారతమ్మ స్నేహితులు సినీ నటులు ఇంద్రసేన బాలరాజ్, మాజీ కౌన్సిలర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ వైపల్యం తో సమ్మక్క పూజారి కుమారునికి తీవ్రంగా గాయలు అయినాయి



ములుగు జిల్లా (ప్రతినిధి) వార్త పత్రిక :మేడారం గద్దెల వద్ద నాసిరకం పనులు ప్రభుత్వం వైపల్యంతో డ్యూటీలో ఉన్న సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన రానా రమేష్ కుమారునికి కాలు మీద దిమ్మలు పడటం తో రెండు చోట్ల కాలు ఇరిగింది గాయాలు అయ్యాయి అని బాధితునికి వైద్య ఖర్చులు ప్రభుత్వం ఇవ్వాలి అని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు సిద్దబోయిన సురేందర్ డిమాండ్ చేశారు

## పాపన్నపేట మండలంలోని గాంధారిపల్లి గ్రామంలో అక్రమ ఇసుక నిల్వలు సీజ్




పాపన్నపేట, మండలం మార్చి 25:(వార్త పత్రిక ప్రతినిధి) :పాపన్నపేట మండలం గాంధారిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 30 ట్రాక్టర్ల ఇసుకను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆర్ఐ సత్తు స్వామి, మంజుల క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి 3 ఇసుక కుప్పలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు అతిక్రమించి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# శంషాబాద్ ఇంద్ర రెడ్డి కాలనీలో ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

- విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు
- ఆధ్యాత్మిక భావం ఉంటే ఈర్ష ద్వేషాలకు తాండదు
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




వార్త పత్రిక , రాజేంద్రనగర్, మార్చి 25 :శంషాబాద్ పురపాలక పరిధిలోని ఇంద్ర రెడ్డి కాలనీలో బుధవారం నూతనంగా నిర్మించబడిన దేవాలయంలో ఆలయ నిర్మాత ధర్మకర్త, శంషాబాద్ పురపాలక మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ సమక్షంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలోని రాళ్లగూడలో గల ఇంద్ర రెడ్డి కాలనీలో ఇటీవల నిర్మించబడిన నూతన దేవాలయం లో గత మూడు రోజులుగా నవగ్రహ పూజ కార్యక్రమాలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు . బుధవారం రోజు ఆలయంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, నాయకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ ధర్మకర్త బండి గోపాల్ యాదవ్ వారి ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. తదనంతరం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావం ప్రతి ఒక్కరు పెంచుకోవాలన్నారు దీనితో ఈర్ష ద్వేషాలకు తాండదని వారు అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మానసిక ప్రశాంతతకు నిలయంగా మారుతాయి అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజా ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గణేష్ గుప్తా, దూదల వెంకటేష్, పలువురు సీనియర్ నాయకులు, ఇంద్ర రెడ్డి కాలనీ ప్రజలు, తది తరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షలో శ్రీవిద్య పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

- గురుకుల పాఠశాలకు 14మంది విద్యార్థుల ఎంపిక




పాపన్నపేట, మండలం మార్చి 25, వార్తాపత్రిక (ప్రతినిధి) : తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలో శ్రీ విద్య పాఠశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. పాఠశాల నుండి 15మంది విద్యార్థిని విద్యార్థులు ఫిబ్రవరి 22న ప్రవేశ పరీక్షలకు హాజరు కాగా రాష్ట్ర ప్రభుత్వ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష రిజల్ట్ మంగళవారం సాయంత్రం ప్రకటించడంతో శ్రీ విద్య పాఠశాల నుండి మొదటి విడత జాబితాలో 14మంది విద్యార్థిని విద్యార్థులు 5వ తరగతి ప్రవేశ కు అర్హత సాధించారు. కాగా పాఠశాల నుండి 15మంది విద్యార్థిని విద్యార్థులు ప్రవేశ పరీక్షలో పాల్గొని పరీక్ష వ్రాయగా 14మంది విద్యార్థులు ర్యాంకు సాధించడం కోసం కృషి చేసిన ఉపాధ్యాయులు దుర్గ. సునీత. అనురాధ. షీలా. విలాస్. జ్యోతిరాజ్ ప్రధాన్ లు పాఠశాల యాజమాన్యం,ప్రిన్సిపాల్ రవీందర్ గుప్తా .,కరస్పాండెంట్ లు నిటలాక్షప్ప. సుమన్, లు అభినందించారు. ప్రతి ఏటా తెలంగాణ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష లలో ఇలాంటి ఫలితాలు పునరావృతం కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు

# ఎస్ ఎఫ్ ఐ ఛలో అసెంబ్లీ" పై పోలీసుల నిర్బంధం ఖండనీయం

- విద్యారంగానికి నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది
- 15% కేటాయింపు చేస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎస్ ఎఫ్ ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె వై ప్రణయ్




వార్త పత్రిక , రాజేంద్రనగర్, మార్చి 25 :పెండింగ్ ఫీజా రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ల వెంటనే విడుదల చేయాలంటూ చేపట్టిన ఎస్ ఎఫ్ ఐ ఛలో అసెంబ్లీ ఉద్రిక్తతకకు దారిసింది ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె వై ప్రణయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లు పూర్తిగా న్యాయసమ్మతమైనవని, వాటిని పరిష్కరించాల్సింది పోయి ఉద్యమాలపై అణచివేత విధానం అవలంబించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న రూ.8500 కోట్ల స్కాలర్షిప్ల, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర బడ్జెట్ను సవరించి విద్యారంగానికి కనీసం 20 శాతం కేటాయింపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకులాలలో సుమారు 70% అద్దె భవనాలలోనే నడుస్తున్నాయని, అద్దె భవనాలలో నడుస్తున్న గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీలకు తక్షణమే స్వంత భవనాలు నిర్మించాలని కోరారు.అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు . అరెస్టయిన వారిలో ఎస్ ఎఫ్ ఐ జిల్లానాయకు లు,శ్రీకాంత్, శివ,తరంగ్,అరుణ్,వంశీ
తరుణ్, తనిష్క, సాయి, కౌశిక్,
తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ లైన్ తెగిపడడంతో గొర్రెలు మృతి

వార్త ప్రతిక :-మరిపెడ :మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం.గిరిపురం ఆ రోడ్ నుండి పూసల తండా వైపు వెళ్లే రహదారి వైకుంఠదం వద్ద ఉన్న ఒక కొత్త రైస్ మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యం రోజురోజుకూ పెరుగుతూ గ్రామ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారింది.గ్రామం మీదుగా సింగిల్ ఫేజ్.విద్యుత్.లైన్‌ను.ప్రమాదకరంగా.తీసుకెళ్తుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ లైన్‌ను వెంటనే పొలాల మార్గం ద్వారా మార్చాలని గ్రామ సర్పంచ్, గ్రామ అధ్యక్షులు, ఇతర నాయకులు పలుమార్లు సూచించినప్పటికీ మిల్లు.యాజమాన్యం.స్పందించకపోవడం గమనార్హం.ఈ సమస్యపై గ్రామ ప్రతినిధులు ఇప్పటికే ఎఈ , డి ఈ విద్యుత్ శాఖ అధికారులను కలిసి వివరించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు. ఆరోపిస్తున్నారు.ఇప్పటికే గతంలో విద్యుత్ లైన్ తెగిపడడంతో గొర్రెలు మృతి.చెందిన.ఘటన.చోటుచేసుకున్నామిల్లు యాజ



మాన్యం ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకపోవడం, బాధ్యత వహించకపోవడం విమర్శలకు దారితీసింది.ఇటీవల మళ్లీ అదే మార్గంలో డబుల్ లైన్ వేయడం వల్ల గడ్డి వాములు, పురిగుడిసెల మధ్యగా విద్యుత్ సరఫరా జరుగుతూ ప్రమాద పరిస్థితులు మరింత తీవ్రమయ్యాయి. దీంతో గ్రామ ప్రజలు ఎప్పటి కప్పుడు భయాందోళనలకు.గురవుతున్నారు.మిల్లు యాజమాన్యం మాకు అనుమతులు ఉన్నాయి, మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా స్పందించడం పట్ల గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల మరోసారి లైన్ తెగిపడి గొర్రెలు మృతి చెందడం స్థానికులను కలచివేసింది. ఇది కేవలం జంతువుల ప్రాణాలకు మాత్రమే కాకుండా భవిష్యత్తులో మనుషుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశముందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.ఈ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే గ్రామ ప్రజలతో కలిసి భారీ స్థాయిలో ఆందోళన చేపడతామని గ్రామ నాయకులు హెచ్చరించారు.మిల్లు యాజమాన్యం వెంటనే స్పందించి, సురక్షిత మార్గంలో విద్యుత్ లైన్లను మార్చి ప్రజల ప్రాణాలను రక్షించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# సమన్వయంతో మున్సిపాలిటీ అభివృద్ధి చేసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

వార్త ప్రతిక :-తొర్రూరు :సమన్వయంతో మునిసిపాలిటీని అభివృద్ధి చేసుకోవాలని, దానికి ప్రభుత్వ పక్షాన సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.బుధవారం డివిజన్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు.ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరు కాగా కమిషనర్ వక్కల శ్యాంసుందర్ బడ్జెట్ వివరాలను చదివి వినిపించారు.ఆదాయ, వ్యయం వివరాలతో పాటు వివిధ పథకాల ద్వారా ఆదాయాన్ని ఆశిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూపొందించిన బడ్జెట్లో ఆదాయం రూ.17.84 కోట్లు కాగా వ్యయం 17.83 కోట్లుగా ఆమోదం తెలిపారు. వివిధ పద్దులపై చర్చించి ఆదాయాన్ని సమకూర్చుకునే దిశగా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సభ్యులు అభిప్రాయ పడ్డారు.2026-- 27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.17.84 కోట్లతో ప్రతిపాదించిన బడ్జెట్ కు సభ్యులు ఆమోదం తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..బడ్జెట్ కు అనుగుణంగా నిధులు సమకూర్చుకొని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నారు.ప్రజలపై భారం పడకుండా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచనలు చేశారు.మున్సిపల్ పట్టణ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధి చేయాలని అందుకు ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు, వార్డులలో అంతర్గత అభివృద్ధి పనులు సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులు, పట్టణ ప్రకృతి వనాల అభివృద్ధి, చెట్లు నాటడం,



పచ్చదనం, పరిశుభ్రత పాటించడం, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా షెడ్యూలు ప్రకారం కేటాయించిన అభివృద్ధి పనులు నిర్వహించాలన్నారు. తమ వార్డు పరిధిలో ఏం జరుగుతుందనే అంశాలను గమనిస్తూ ఉండాలని, యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ సేవిస్తూ ఎవరైనా తారసపడితే సంబంధిత పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించాలని తెలిపారు,ప్రతి పనిని నిర్వహించడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌన్సిల్ సమావేశం ఆమోదం తీసుకొని పనులను ప్రారంభించాలని, పట్టణంలో ఎప్పటికప్పుడు ఉదయమే శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి.ఒక్కరూ.బాధ్యతాయుతంగా తమ యొక్క పన్నులను చెల్లించాలని, తద్వారా పట్టణ అభివృద్ధికి తమ భాగస్వామ్యం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ సోమ రజిని,కౌన్సిలర్లు భూసాని జయమ్మ, తూర్పాటి రవి,పేర్ల జంపన్న, మాడుగుల భవానీ లత, అల్లం శ్యామల, కిన్నెర సునీత, ముద్దసాని సురేష్, కర్నే నాగరాజు, ధరావత్ పద్మ, బసన బోయిన ఐలమ్మ,చకిలేల అలివేలు,జాటోతు భద్రునాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ ఆర్ బి నగర్ లో విచ్చలవిడిగా నిర్మాణాలు

**– ఈ అక్రమ నిర్మాణాలపై పట్టింపేది**

**– జీవో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న పట్టించుకోని వైనం**

**– అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలి**

వార్త పత్రిక, రాజేంద్రనగర్, మార్చి 25 : శంషాబాద్ లోని ఆర్ బి నగర్ లో విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలోని పలు ప్రాంతాల్లో నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శంషాబాద్ పురపాలక పరిధిలోని ఆర్బి నగర్ లో స్ట్రీట్ నెంబర్ 9, స్ట్రీట్ నెంబర్ 8 ఖ, తదితర ప్రాంతాల్లో జీవో నిబంధనలు ఉల్లంఘించి అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా భారీ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఈ నిర్మాణాల



పరంపర కొనసాగుతున్న అధికారులు నిమ్మకు నేరెత్తినట్లుగా వ్యవహరించడంలో మతలేవేమిటో అర్థం కాకుండా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శంషాబాద్ పురపాలక పరిధిలో ఆర్బీనగర్ మధుర నగర్ రాయల్ విల్లాస్ తదితర ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున నిర్మాణాలు చేపడుతుండడంతో అధికారుల ఉదాసీనత



వైఖరి ఏమిటో అర్థం కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రాంపురం గ్రామంలోరైతన్న మీకోసం కార్యక్రమం

**– రైతు సంక్షేమమే సీఎంచంద్రబాబు లక్ష్యం**

**– ఎమ్మెల్యే కే ఈ శ్యాం కుమార్**

తుగ్గలి మార్చి 25 (వార్తాపత్రిక):-రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని ఎమ్మెల్యే కే. ఈ. శ్యాం కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాంపురం గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగిల్ విండో డైరెక్టర్ భీమిలింగ చౌదరి, మాజీ సర్పంచ్ చంద్రన్న, స్థానిక టిడిపి నాయకులు దేవేంద్ర ,వెంకట్రామ చౌదరి, మల్లయ్య, మద్దిలేటి, ఫీల్డ్ అసిస్టెంట్ ఇస్మాయిల్, గంపల శివ, మదిరి శేఖర్, పత్తికొండ అశోక్, తదితరులు ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ కు మేళతాళాలతో, బాణా సంచులు పేల్చుతూ ఘన స్వాగతం పలికి, శాలువా గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా ఏటా మూడు విడతల్లో నేరుగా రైతు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తోందన్నారు. గ్రామంలో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి అన్నదాత సుఖీభవ లబ్ధిదారులను పలకరించారు. ప్రతి రైతు కుటుంబం ఆత్మాభిమానంతో గౌరవంగా బతకాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షన్నారు. పంట కాలంలో పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించకుండా ప్రభుత్వం రూ.20వేల పెట్టు బడి రాయితీ నేరుగా రైతుల అకౌంటుకు జమ చేయడం జరుగుతోందన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,




రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.రైతులు ధైర్యంగా పంట పొలాల్లో వ్యవసాయం చేయాలని, ఏ ఇబ్బంది ఎదురైన అండగా మేమున్నామన్నారు. సబ్సిడీ ఎరువులు, విత్తనాలు అందజేయడంతో పాటు పంట ఆఖరిలో గిట్టుబాటు ధర లేనప్పుడు పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించడం జరుగుతోందన్నారు. దాంతో బహిరంగ మార్కెట్లో పంట విలువ పెరిగే అవకాశం ఏర్పడుతుందన్నారు. లబ్ధి పొందిన కొందరు రైతులతో ఎమ్మెల్యే వ్యక్తిగతంగా కలుసుకుని ఈ నగదు వారికి ఎలా ఉపయోగపడిందో అడిగి తెలుసుకున్నారు. రైతుకు ప్రతి సందర్భంలోనూ కొండంత అండగా నిలుస్తున్న చంద్ర బాబు ప్రభుత్వానికి అన్నదాతలు అండగా ఉండాలని విన్నవించారు. వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ ప్రభుత్వం ద్వారా రైతులకు అందుతున్న రాయితీలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి, సింగల్ విండో అధ్యక్షులు అప్పా వేణుగోపాల్,టిడిపి నాయకులు మనోహర్ చౌదరి, మధుబాబు చౌదరి, కడమ కుంట్ల పక్కిరప్ప, అక్బర్, కోటేష్ గౌడు, ఉప్పర్ల పల్లె మనోహర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తుగ్గలి మండలంలోని సర్పంచ్‌లకు ఘన సన్మాన సభ



తుగ్గలి మార్చి 25 (వార్త పత్రిక):-తుగ్గలి మండల పరిధిలోని సర్పంచ్‌లకు అట్టహాసంగా అభినందన సభ నిర్వహించారు. సర్పంచ్‌లు హాజరై ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 2తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర మరియు ఎంపీపీ ఆర్ ,రామంజమ్మ తుగ్గలి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్లను ఘనంగా సన్మానించారు, ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి కృషి చేసిన ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ ఈ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాట్లాడుతూ సర్పంచ్‌లు అధికారానికి కాదు, అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచారని అన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, నిర్మించడం ద్వారా గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేశామని తెలిపారు. సర్పంచ్‌ల సహకారం లేకుండా ఈ అభివృద్ధి సాధ్యమయ్యేది కాదని, వారి సేవలను తరతరాలు గుర్తుంచుకుంటాయని తెలిపారు. సర్పంచ్‌లు రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించారని, గ్రామాల్లో ప్రజలతో ఒక కుటుంబంలా మమేకమై పనిచేశారని పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర ,మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వ్యవస్థలో సర్పంచ్ స్థానానికి ప్రత్యేక గౌరవం ఉందన్నారు. గ్రామాల్లో కనిపిస్తున్న అభివృద్ధి సర్పంచ్‌ల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వ మోహన్, ఈ ఓ ఆర్ డి శ్రీహరి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఐదేళ్ల పాటు ప్రజాసేవలో విశిష్ట సేవలందించిన సర్పంచ్‌లను ఘనంగా సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# అట్టహాసంగా ఆత్మీయ సర్పంచ్ లకు అభినందన సభ..




**– వైయస్సార్ సిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్ రెడ్డి**

**– వైయస్సార్సీపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్ యాదవ్**

**– ఎంపీపీ ఆర్, రామంజమ్మ**

**– ఎంపీపీ సహాయక సలహాదారుడు హనుమంతు**

తుగ్గలి మార్చి 25 (వార్తాపత్రిక):-తుగ్గలి మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన సభకు హాజరైన సర్పంచ్ లు. ఏప్రిల్ 2వ తేదీకి సర్పంచ్ ల పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా సర్పంచ్ లకు సత్కారం. ఐదేళ్ల ప్రజా సేవకు అభినందన సభ, తుగ్గలి మండలంలో ఐదేళ్ల పాటు ప్రజాసేవలో నిలిచిన సర్పంచ్‌లకు అట్టహాసంగా అభినందన సభ నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ ఈ కార్యక్రమం జరిగింది. సర్పంచ్‌ల హాజరు

గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన నేతలకు సన్మానం. పదవీకాలం ముగిసే సందర్భంలో సేవలకు గుర్తింపుగా కార్యక్రమం వైయస్సార్సీపి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి ఎం, శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..

సర్పంచ్‌లు అధికారానికి కాదు, అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది, గ్రామాలను ఎంతో గొప్పగా అభివృద్ధి చేయడం జరిగింది.

వైయస్సార్సీపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం,శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ లు వేరు కాదు.. మా కుటుంబం వేరు కాదు.. అందరూ ఒకే కుటుంబంలా బ్రతికాం. రాజకీయంగానే కాదు కష్టమొచ్చినా, ఆపద వచ్చినా, పండుగ వచ్చినా, విపత్తు వచ్చినా, అందరూ ఒకటిగానే ఉన్నాం. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సొంత మనిషిలా మీకు సాయం చేశాను.. మీరు కూడా నన్ను ఒక నాయకుడిగా కంటే ఒక కుటుంబ పెద్దగా భావించి ఆదరించారు..పాతికేళ్లకుపైగా మన బంధం ఒక కుటుంబంగానే కొనసాగింది. ఇప్పుడు కూడా నాపై కూటమి ప్రభుత్వ కుట్రలను ఎదర్కొవడానికి ఒక కుటుంబంగానే పోరాడుతున్నాం. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులతో గ్రామ సర్పంచ్ పేరును భవిష్యత్తు తరాలు చెప్పుకుంటాయి. సర్పంచ్ లు తలెత్తుకునేలా చేశాం. ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు వేశాం, రచ్చబండలు కట్టించాం, గ్రామ సచివాలయాలు కట్టించాం. రైతు భరోసా కేంద్రాలు కట్టించాం. మహిళా భవనాలు నిర్మించాం. పచ్చని చెట్లు నాటించాం.. ఇలా చెప్పలేనంతగా అభివృద్ధిని పరిగెత్తించాం. తుగ్గలి మండలంలో జరిగిన అభివృద్ధి మరెక్కడా జరగలేదు..నభూతో నభవిష్యత్తు అన్న విధంగా గ్రామాలను తీర్చిదిద్దడం జరిగింది.. అదంతా సర్పంచ్ లుగా ఉన్న మీ అందరి సహకారంతోనే సాధ్యమైంది. గ్రామ పంచాయతీ పటంలో మీ పేరు చిరస్థాయిగా నిలిచిపోవడమే కాకుండా ఆ గ్రామంలో జరిగిన అభివృద్ధి గురించి తరతరాలు చెప్పుకుంటాయి. జగనన్న ప్రభుత్వంలో మూడేళ్లుగా పరిపాలన చేసిన సర్పంచ్ లు రెండేళ్ల పాటు కూటమి ప్రభుత్వంలో కూడా పనిచేశారు. గ్రామాల్లో అప్పుడు జరిగిన అభివృద్ధి తప్ప ఈ రెండేళ్లలో ఏమీ జరగలేదని మీ అందరికీ కూడా తెలుసు. మన హయాంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులకు నేటికీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నారు అంటే ఏ స్థాయిలో మనం అభివృద్ధి చేశామో గుర్తుంచుకోవాలి. పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించాం.. ప్రభుత్వం మారినా మీ పోరాట పటిమ మాత్రం మారలేదు. జగనన్న ఇచ్చిన అవకాశం, జగనన్న అందించిన సహకారం, జగనన్న చూపించిన ఆదరణతోనే తుగ్గలి మండలంలో ప్రతి గ్రామంలో పది కోట్లకు తక్కువ లేకుండా అభివృద్ధి పనులు చేయగలిగాం. సర్పంచ్ లుగా మీ పదవీ కాలం ముగియగానే వెనక్కు తిరిగి చూసుకుంటే ఏమీ లేదన్న బాధ మీకు అవసరం లేదు.. కోట్ల రూపాయలతో చేసిన అభివృద్ధి మీ వెంట నిలిచింది. ఎవ్వరు వచ్చి అడిగినా సర్పంచ్ గా మీ హయాంలో జరిగిన అభివృద్ధిని చూపించవచ్చు. పదవిలో ఉన్నప్పుడు పంచాయతీ అభివృద్ధికి పనిచేశారు.. పదవి పూర్తయిన తరువాత పార్టీకి పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. పంచాయతీల్లో సర్పంచ్ లుగా ఉన్నంత కాలం మీరు రాజకీయాలు చేయలేదు కానీ ఏప్రిల్ 2వ తేదీ తరువాత మీ పదవులు ముగియగానే జగనన్న సైనికులుగా మారి పార్టీ పటిష్టతకు గ్రామ స్థాయిలో పనిచేయాలని కోరుతున్నా ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, పగిడిరాయి జగన్నాథ్ రెడ్డి,రాతనమోహన్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, తుగ్గలి మోహన్ రెడ్డి, అట్ల గోపాల్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు

Edited,Printed,Published and Owned by Mare Chinnababu , Printed at sravanthi prienters , Rtc Cross Roads ,Hyderabad - 500020. Published at House No : 223 , Gajula Ramaram , Road 1, Hyderabad - 500020, Telangana. Editor : Mare Chinnababu , (TGTEL/33/B45017) e-mail : vaarthapatrika@gmail.com , Cell : 9490617567 , 99081 21111